వాస్తవాలు పలుకు DD9

వార్త

TGTEL/26/A2635

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి: 06 | సంచిక: 145 | 06-10-2026 | మంగళవారం | పేజీలు: 10 | వెల: 3/-

ఈవీఎంపై అసత్య ప్రచారం

- నెహ్రూ కుటుంబం నుంచి ప్రధాని లేకపోవడమే కారణం
- ఎన్నికలు అక్రమమైతే రేవంత్ రెడ్డి గెలుపు కూడా చట్టవిరుద్ధమే
- సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్
- ఈవీఎంలపై కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు



2

సామాన్యుడిపై ధరల భారం.. ప్రభుత్వం నిద్రమత్తులో ఉందా?

- సన్నబియ్యం ధరలు నాలుగు నెలల్లో 25 శాతం పెరిగాయన్న హరీష్ రావు
- రైతుకు గిట్టుబాటు లేదు.. వినియోగదారుడికి అందుబాటు లేదని విమర్శ
- ఉల్లిపాయ, వెల్లుల్లి, పప్పుల ధరలపై ప్రభుత్వాన్ని నిలదీత
- బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలపై తక్షణ తనిఖీలకు డిమాండ్

హైదరాబాద్, (డీడీ9 వార్త):

నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతూ సామాన్య పౌరుడి నడ్డి విరుస్తుంటే, వాటిని అదుపు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావు విమర్శించారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విరుచుకుపడిన ఆయన, పౌరసరఫరాల శాఖ పర్యవేక్షణా రాహిత్యానికి సామాన్య ప్రజలే మూల్యం చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే సన్న బియ్యం ధరలు ఏకంగా 25 శాతం పెరగడం ప్రభుత్వ వైఫల్యానికి స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. రికార్డు స్థాయిలో పంట దిగుబడి సాధించామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, ఉత్పత్తి పెరిగినప్పుడు మార్కెట్లో బియ్యం ధరలు ఎందుకు ఆకాశాన్ని అంటుతున్నాయో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ప్రభుత్వం రేషన్ ద్వారా ఇస్తున్న నాణ్యత లేని సన్నబియ్యాన్ని ప్రజలు వినియోగించడం లేదనడానికి, బయట మార్కెట్లో బియ్యం ధరలు అదుపు తప్పడమే ప్రధాన సాక్ష్యమని వ్యాఖ్యానించారు.

రైతుకు గిట్టుబాటు లేదు.. వినియోగదారుడికి అందుబాటు లేదు

ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్నకు మద్దతు ధర పేరిట నామమాత్రపు ధర మాత్రమే దక్కుతుంటే, మధ్యదళారులు మాత్రం క్వింటాకు రూ.8,000 పైమాటే లాభపడుతున్నారని హరీష్ రావు ఆరోపించారు. రైతుకు గిట్టుబాటు ధర దక్కక, ఇటు వినియోగదారుడికి అందుబాటు ధరలో సరుకులు అందక తీవ్ర అవస్థలు పడుతుంటే కేవలం మధ్యవర్తులు మాత్రమే కోట్లు కొల్లగొడుతున్నారని మిగతా 2లో..






తెలంగాణలో 90 లక్షల ఓట్లు డిలిట్

- సర్ పేరుతో భారీ కుట్ర జరిగింది
- పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ఆరోపణలు
- సర్ పేరుతో ఓటర్ల జాబితాలో అవకతవకలు
- ఓట్లు గల్లంతైన వారి హక్కులు కాపాడుతామని ప్రకటన
- ప్రజాసంఘాలు, ఎన్జీవోలు, కుల సంఘాలకు లేఖలు
- దిల్లీలో ఖర్గే, రాహుల్, వేణుగోపాల్ కీలక భేటీ
- రెండు నెలల పాటు నిరంతర కార్యక్రమాలకు నిర్ణయం
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ధర్నాలు, ర్యాలీలు
- కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితోనే ఈసీ వ్యవహరిస్తోందని ఆరోపణ
- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- 6, 7 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు.. 8న లోక్‌భవన్ వద్ద ధర్నా

హైదరాబాద్, (డీడీ9 వార్త):

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరుతో 90 లక్షల ఓట్లు తొలగించారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఓట్లు గల్లంతైన వారు తమ ఓటు హక్కును కాపాడుకునేలా రాష్ట్రంలోని ప్రజాసంఘాలు, ఎన్జీవోలు, కుల సంఘాలకు లేఖలు రాస్తామని తెలిపారు. సర్ ప్రక్రియలో అవకతవకలపై రానున్న రెండు నెలల పాటు నిరంతర కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు మహేశ్ గౌడ్ తెలిపారు. ఈ అంశంపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అధ్యక్షతన దిల్లీలో కీలక సమావేశం మిగతా 2లో..

ఫోన్ ట్యాపింగ్ కేసులో కోదండరెడ్డిని విచారించిన సిట్



- కార్యాలయానికి వెళ్లి 40 నిమిషాలకు పైగా ప్రశ్నలు
- వివిధ అంశాలపై వివరాలు సేకరణ
- కోదండరెడ్డి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన అధికారులు
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఆయన పేరు వెలుగులోకి
- ఇటీవల సిట్ నోటీసులు జారీ
- 2023 ఎన్నికల సమయంలో ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు గుర్తింపు
- కొన్ని నెలల పాటు ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడి
- ట్యాపింగ్ వ్యవహారంపై కొనసాగుతున్న విచారణ
- కేసులో మరిన్ని వివరాలు సిట్ దర్యాప్తులో వెల్లడి కానున్నాయి

2

సింగరేణి కార్మికులకు దీపావళి కానుక

- ఒక్కొక్కరికి రూ.1,10,250 బోనస్
- దసరా, దీపావళి వేళ భారీ ప్రకటన
- కార్మికులకు శుభాకాంక్షలు తెలిపిన కిషన్‌రెడ్డి
- తెలంగాణకు సింగరేణి కొంగు బంగారమని వ్యాఖ్య
- బొగ్గు ఉత్పత్తి పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశం
- కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తామని హామీ
- ఉద్యోగ భద్రత, కుటుంబాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి
- సింగరేణికి రావాల్సిన రూ.60 వేల కోట్ల బకాయిల విడుదలకు డిమాండ్
- బోనస్‌తో కార్మికుల్లో ఆనందోత్సాహాలు



హైదరాబాద్, (డీడీ9 వార్త):

సింగరేణి కాలరీస్ సంస్థ కార్మికులకు దీపావళి పండుగ వేళ భారీ బోనస్ ప్రకటించారు. ఒక్కో కార్మికుడికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. దసరా, దీపావళి పండుగల సందర్భంగా ఈ ప్రకటన వెలువడటంతో కార్మిక వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సింగరేణి మిగతా 2లో..

సీఈసీపై చర్యలు తీసుకోలేం

- సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ
- వార్తాపత్రిక కథనం ఆధారంగా ఉత్తర్వులు ఇవ్వలేమని క్లారిటీ
- జ్ఞానేశ్ కుమార్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారా?
- మిగతా ఈసీల అధికారాలను సీఈసీ వినియోగించుకోవచ్చా?
- ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ
- నిర్ణయాలు ఏకగ్రీవమా.. మెజారిటీతోనా?
- వివరాలు సమర్పించాలని ఈసీకి ఆదేశం
- అక్రమం రుజువైతే తదుపరి చర్యలపై ఆదేశాలిస్తామన్న కోర్టు
- ఫామ్-6 మార్పులను ఆమోదించలేదన్న సుప్రీంకోర్టు



హైదరాబాద్, (డీడీ9 వార్త):

'సర్' అంశంలో ఎన్నికల సంఘంలో విభేదాలు ఏర్పడ్డాయంటూ వచ్చిన వార్తలపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక వార్తాపత్రికలో వచ్చిన కథనం ఆధారంగా ప్రధాన మిగతా 2లో..



2

ఫామ్-6ను చట్టవిరుద్ధంగా మార్చారు

- లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- బీజేపీకి అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారన్న ఆరోపణ
- జ్ఞానేశ్ కుమార్ పదవిని దుర్వినియోగం చేశారని విమర్శ
- ఫామ్-6 మార్పులను సుప్రీంకోర్టు ఆమోదించలేదన్న సీజేఐ
- ఎవరి అనుమతితో మార్చారో తెలుసుకునేందుకు రికార్డులు కోరిన కోర్టు
- ఈసీలో కీలక నిర్ణయాలపై కేంద్రానికి, ఈసీకి నోటీసులు
- ముగ్గురు ఈసీల సమ్మతి లేకుండా నిర్ణయాలు తీసుకున్నారా?
- నిర్ణయాలు ఏకగ్రీవమా.. మెజారిటీతోనా అని ప్రశ్న
- సీఈసీ ఒక్కడే నిర్ణయాలు తీసుకున్నారా?
- బాధ్యులైన వారందరినీ జవాబుదారీ చేస్తామన్న రాహుల్

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలపై కాంగ్రెస్ చాకచక్యం

- నవంబర్‌లో ముగియనున్న ముగ్గురు ఎమ్మెల్సీల పదవీకాలం
- ఆశావహులపై కసరత్తు.. హైకమాండ్‌తో రాష్ట్ర నేతల చర్చలు
- కేబినెట్ భేటీలో పేర్లపై చర్చ.. రాజ్‌భవన్‌కు ప్రతిపాదనలు
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల భర్తీకి కాంగ్రెస్ వ్యూహం
- వచ్చే వారంలో అభ్యర్థులపై తుది కసరత్తు
- ఈ నెలాఖరులో కేబినెట్ ఆమోదం.. ఆ తర్వాత రాజ్‌భవన్‌కు
- ముగ్గురు స్థానాల కోసం కాంగ్రెస్‌లో ఆశావహుల హడావుడి
- హైకమాండ్ ఆమోదంతో ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికకు రంగం సిద్ధం
- సకాలంలో భర్తీకి ప్రభుత్వం వేగంగా అడుగులు
- ఎమ్మెల్సీ స్థానాలపై కాంగ్రెస్‌లో మొదలైన మంతనాలు



హైదరాబాద్, (డీడీ9 వార్త):


తెలంగాణలో గవర్నర్ కోటా కింద ఖాళీ కానున్న శాసనమండలి (ఎమ్మెల్సీ) స్థానాల భర్తీకి కాంగ్రెస్ ప్రభుత్వం ముమ్మర కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం గవర్నర్ కోటాలో ఉన్న ముగ్గురు ఎమ్మెల్సీల పదవీకాలం నవంబర్ మూడో వారంలో ముగియనుండటంతో, ఆ స్థానాలను సకాలంలో భర్తీ చేసేందుకు అధిష్టానం ప్రాథమిక వ్యూహాన్ని సిద్ధం చేస్తోంది. ఈ నెలాఖరులోగా జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఆశావహుల పేర్లపై సమగ్రంగా చర్చించి, ఆమోదించిన ప్రతిపాదనలను రాజ్‌భవన్‌కు మిగతా 2లో..

హనీట్రాప్‌తో రిటైర్డ్ ఉద్యోగికి టోకరా..

- మహిళ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా
- రిటైర్డ్ ఉద్యోగితో పరిచయం పెంచుకున్న సైబర్ నేరగాడు
- అసభ్యకర చాటింగ్‌ను అడ్డుపెట్టుకుని బెదిరింపులు
- క్రిమినల్ కేసులు పెడతామంటూ భయపెట్టిన వైనం
- వివిధ కారణాలతో విడతల వారీగా డబ్బుల వసూలు
- హనీట్రాప్ పేరుతో ఏకంగా రూ.38 లక్షలు కాజేసినట్లు గుర్తింపు
- చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులు

హైదరాబాద్, (డీడీ9 వార్త):

హైదరాబాద్‌లో హనీట్రాప్ పేరుతో జరిగిన సైబర్ మోసం కేసును పోలీసులు ఛేదించారు. ఓ వయోవృద్ధ రిటైర్డ్ ఉద్యోగిని టార్గెట్ చేసిన సైబర్ నేరగాడు.. మహిళ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా సృష్టించి బాధితుడితో పరిచయం పెంచుకున్నాడు. ఆ తర్వాత వివిధ రకాలుగా బెదిరించి ఏకంగా రూ.38 లక్షలు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. నిందితుడు మహిళ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ప్రొఫైల్‌ను సృష్టించి వయోవృద్ధ రిటైర్డ్ ఉద్యోగికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపాడు. బాధితుడితో పరిచయం పెంచుకుని నమ్మకం సంపాదించాడు. తొలుత గృహ అవసరాలు, ఇతర కారణాలను చెబుతూ డబ్బులు తీసుకున్నాడు. ఆ తర్వాత బాధితుడితో అసభ్యకరంగా మిగతా 2లో..



ఫామ్‌6ను చట్టవిరుద్ధంగా మార్చారు

- లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- బీజేపీకి అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారన్న ఆరోపణ
- జ్ఞానేశ్ కుమార్ పదవిని దుర్వినియోగం చేశారని విమర్శ
- ఫామ్-6 మార్పులను సుప్రీంకోర్టు ఆమోదించలేదన్న సీజేఐ
- ఎవరి అనుమతితో మార్చారో తెలుసుకునేందుకు రికార్డులు కోరిన కోర్టు
- ఈసీలో కీలక నిర్ణయాలపై కేంద్రానికి, ఈసీకి నోటీసులు
- ముగ్గురు ఈసీల సమ్మతి లేకుండా నిర్ణయాలు తీసుకున్నారా?
- నిర్ణయాలు ఏకగ్రీవమా.. మెజారిటీతోనా అని ప్రశ్న
- సీఈసీ ఒక్కడే నిర్ణయాలు తీసుకున్నారా?
- బాధ్యులైన వారందరినీ జవాబుదారీ చేస్తామన్న రాహుల్

హైదరాబాద్, (డీడీ9 వార్త):

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫామ్‌6లో మార్పులను జ్ఞానేశ్ కుమార్ చట్టవిరుద్ధంగా, బీజేపీకి అనుకూలంగా ఏకపక్షంగా చేశారని ఆరోపించారు.

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన ఫామ్‌6లో చేసిన మార్పులపై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఫామ్‌6లో చేసిన మార్పులను కోర్టు ఆమోదించలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు.

"మార్చిన ఫామ్‌6లో ఏదీ మేం ఆమోదించ లేదు. ఎవరు మార్చారో రికార్డులు వచ్చిన తర్వాత చూడాలనుకుంటున్నాం" అని సీజేఐ వ్యాఖ్యానించారు. ఫామ్‌6ను ఎవరి అనుమతితో మార్చారో తెలుసుకునేందుకు సంబంధిత రికార్డులను సమర్పించాలని ఆదేశించారు.

ఈ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించారు. ఫామ్‌6ను జ్ఞానేశ్ కుమార్ చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారని ఆరోపించారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ తన పదవిని దుర్వినియోగం చేసి బీజేపీకి ప్రయోజనం కలిగించేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

ఈ వ్యవహారంలో భాగమైన వారందరినీ బాధ్యులను చేస్తామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

ఈసీ నిర్ణయాలపైనా ప్రశ్నలు

మరోవైపు ముగ్గురు ఎన్నికల కమిషనర్ల సమ్మతి లేకుండా ఎన్నికల సంఘంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారన్న పిటిషన్ల పైనా సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో ఎన్నికల సంఘానికి, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

ఎన్నికల సంఘం కీలక నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నారా? లేక మెజారిటీ ఆధారంగా నిర్ణయించారా? అనే వివరాలను కోర్టు కోరింది. ముగ్గురు ఎన్నికల కమిషనర్ల సమ్మతి లేకుండా కేవలం సీఈసీ మాత్రమే నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశంపైనా వివరాలు సమర్పించాలని ఆదేశించింది.

ఫామ్‌6 మార్పులకు సంబంధించిన రికార్డులు, ఎన్నికల సంఘంలో నిర్ణయాలు తీసుకున్న విధానంపై వివరాలు సమర్పించిన తర్వాత ఈ అంశాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఫోన్ ట్యాపింగ్ కేసులో కోదండరెడ్డిని విచారించిన సిట్

- కార్యాలయానికి వెళ్లి 40 నిమిషాలకు పైగా ప్రశ్నలు
- వివిధ అంశాలపై వివరాలు సేకరణ
- కోదండరెడ్డి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన అధికారులు
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఆయన పేరు వెలుగులోకి
- ఇటీవల సిట్ నోటీసులు జారీ
- 2023 ఎన్నికల సమయంలో ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు గుర్తింపు
- కొన్ని నెలల పాటు ఫోన్‌ను ట్యాప్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడి
- ట్యాపింగ్ వ్యవహారంపై కొనసాగుతున్న విచారణ
- కేసులో మరిన్ని వివరాలు సిట్ దర్యాప్తులో వెల్లడి కానున్నాయి

హైదరాబాద్, (డీడీ9 వార్త):

ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డిని సిట్ అధికారులు విచారించారు. ఆయన కార్యాలయానికి వెళ్లిన అధికారులు దాదాపు 40 నిమిషాలకు పైగా వివిధ అంశాలపై ప్రశ్నించారు. అనంతరం ఆయన స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కోదండరెడ్డి పేరు వెలుగులోకి రావడంతో ఇటీవల సిట్ అధికారులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు ఆయనను విచారించినట్లు తెలుస్తోంది.

2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కోదండరెడ్డి ఫోన్ కొన్ని నెలల పాటు ట్యాప్ అయినట్లు సిట్ దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. ఈ వ్యవహారానికి సంబంధించి ఆయనకు తెలిసిన అంశాలు, ఫోన్ ట్యాపింగ్ జరిగిన కాలం, సంబంధిత పరిణామాలపై అధికారులు వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది.

కోదండరెడ్డి స్టేట్‌మెంట్‌ను నమోదు చేసిన సిట్.. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇతర అంశాలపైనా దర్యాప్తు కొనసాగిస్తోంది. విచారణలో వెల్లడైన వివరాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

సీఈసీపై చర్యలు తీసుకోలేం

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోలేమని స్పష్టం చేసింది. అయితే సీఈసీ జ్ఞానేశ్ కుమార్.. మిగతా ఎన్నికల కమిషనర్లకు రాజ్యాంగబద్ధంగా కేటాయించిన అధికారాలను ఏకపక్షంగా వినియోగించుకున్నారా? అనే అంశాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది.ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘం వివరణను ముందుగా తెలుసుకోవాలని పేర్కొంటూ ఈసీకి నోటీసులు జారీ చేసింది. ఎన్నికల సంఘంలో కీలక నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నారా? లేక మెజారిటీ ఆధారంగా తీసుకున్నారా? అనే వివరాలను సమర్పించాలని కోరింది.

ఒక్క సీఈసీ నిర్ణయించారా?

సీఈసీ ఒక్కరే కీలక నిర్ణయాలు తీసుకున్నారా? మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారా? అనే అంశాలను కూడా కోర్టు పరిశీలించనుంది. సీఈసీ ఏకపక్షంగా వ్యవహరించినట్లు రికార్డుల ద్వారా తేలితే.. తదుపరి చర్యలకు ఆదేశాలు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని ధర్మాసనం తెలిపింది.

ఫామ్-6పై కీలక వ్యాఖ్యలు

కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫామ్ 6లో చేసిన మార్పులపైనా సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. మార్చిన ఫామ్‌6ను తాము ఆమోదించలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు.

"మార్చిన ఫామ్‌6లో ఏదీ మేం ఆమోదించలేదు. ఎవరు మార్చారో రికార్డులు వచ్చిన తర్వాత చూడాలనుకుంటున్నాం" అని సీజేఐ వ్యాఖ్యానించారు.

ఫామ్‌6లో మార్పులు ఎవరి అనుమతితో జరిగాయి? ఎవరు ఆదేశించారు? అనే విషయాలను తెలుసుకునేందుకు సంబంధిత రికార్డులను సమర్పించాలని కోర్టు కోరింది.

13 కోట్ల ఓట్లపైనా పిటిషన్

ఇదే అంశానికి సంబంధించిన ఇతర పిటిషన్లను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణకు స్వీకరించింది. 2025 జూన్ నుంచి 'సర్' ప్రక్రియలో భాగంగా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో తొలగించినట్లు పేర్కొంటున్న 13 కోట్లకు పైగా ఓట్లపై ప్రత్యేక దర్యాప్తు జరపాలని పిటిషనర్లు కోరారు.

సీఈసీ నిర్ణయాలను రద్దు చేయాలని కూడా పిటిషనర్లు విజ్ఞప్తి చేశారు. ఈ అంశాలపై ఎన్నికల సంఘం, కేంద్రం నుంచి వచ్చే వివరణలు, రికార్డులను పరిశీలించిన తర్వాత సుప్రీంకోర్టు తదుపరి నిర్ణయం తీసుకోనుంది.



గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలపై కాంగ్రెస్ ఫోకస్

మొదటిపేజీ తరువాయి

పంపాలని ప్రభుత్వం యోచిస్తోంది. రానున్న వారంలో కాంగ్రెస్ హైకమాండ్ రాష్ట్ర ముఖ్య నేతలతో చర్చించి అభ్యర్థుల తుది జాబితాను ఖరారు చేసే అవకాశం ఉంది.

సామాజిక వర్గాల ప్రాధాన్యం..

రేసులో నిలిచిన ప్రధాన పేర్లు

ఈసారి ఎమ్మెల్సీ స్థానాల ఎంపికలో సామాజిక సమతుల్యతకు కాంగ్రెస్ నాయకత్వం పెద్దపీట వేయాలని భావిస్తోంది. గతంలో సిరిసిల్ల బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ఒక స్థానాన్ని పద్మశాలి సామాజిక వర్గానికి కేటాయించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ వర్గం నుంచి స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ కుటుంబ సభ్యులతో పాటు కైలాస్ నేత, అనిల్ పేర్లు ప్రధానంగా ప్రచారంలో ఉన్నాయి. ఇక మిగిలిన రెండు స్థానాల్లో ఒకదానిని ఎస్సీ (మాదిగ) వర్గానికి కేటాయించాలని అధిష్టానం యోచిస్తుండగా, ఈ రేసులో దొమ్మాట సాంబయ్య, చారకొండ వెంకటేష్ పేర్లు ముందు వరుసలో ఉన్నాయి. అలాగే మూడో స్థానాన్ని బ్రాహ్మణ సామాజిక వర్గానికి కేటాయించే దిశగా పార్టీలో చర్చ జరుగుతుండగా, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

పరిశీలనలో మరికొందరు కీలక నేతలు

కేవలం సామాజిక సమీకరణలే కాకుండా పార్టీకి, ప్రభుత్వానికి సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న మరికొందరు సీనియర్ నేతల పేర్లను కూడా కాంగ్రెస్ అధిష్టానం తీవ్రంగా పరిశీలిస్తోంది. ఈ జాబితాలో సమాచార హక్కు



కమిషనర్ (RTI) అయోధ్య రెడ్డితో పాటు గాంధీ భవన్ ఇన్చార్జి కుమారావు పేర్లు కూడా ఉన్నట్లు సమాచారం. రాబోయే రాజకీయ పరిణామాలు, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా సమర్థులైన అభ్యర్థులను ఖరారు చేసేందుకు పీసీసీ, అధిష్టానం చివరి విడత చర్చలు జరుపుతున్నాయి.

ఈవీఎంపై అసత్య ప్రచారం

- నెహ్రూ కుటుంబం నుంచి ప్రధాని లేకపోవడమే కారణం
- ఎన్నికలు అక్రమమైతే రేవంత్ రెడ్డి గెలుపు కూడా చట్టవిరుద్ధమే
- సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్
- కేరళ, హిమాచల్ సీఎంలూ రాజీనామా చేయాలని సవాల్
- ఈవీఎంలపై కాంగ్రెస్ వైఖరిని ప్రశ్నించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

హైదరాబాద్, (డీడీ9 వార్త):

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. నెహ్రూ కుటుంబానికి చెందిన వ్యక్తి ప్రధాని కావడం లేదనే అసంతృప్తితో కాంగ్రెస్ నేతలు భాజపాపై ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు. భాజపా అక్రమంగా ఎన్నికల్లో గెలుస్తోందంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు.

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పదాధికారుల సమావేశంలో రామచందర్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు చెబుతున్నట్లుగా ఎన్నికలు అక్రమంగా జరిగితే.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కూడా చట్టవిరుద్ధంగానే గెలిచినట్లవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. అలాంటప్పుడు సీఎం పదవికి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

కేరళ, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రులు కూడా రాజీనామా చేయాలని సవాల్ విసిరారు. ఎన్నికల్లో గెలిచినప్పుడు ఈవీఎంలు మంచివని, ఓడిపోయినప్పుడు అవే ఈవీఎంలు మంచివి కావని కాంగ్రెస్ భావిస్తోందా? అని ప్రశ్నించారు.

"గతంలో కేసీఆర్ కుటుంబం, ఇప్పుడు రేవంత్ బ్రదర్స్ బాగుపడుతున్నారు తప్పితే తెలంగాణ ప్రజలు మాత్రం బాగుపడడం లేదు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవు. కానీ దిల్లీకి మూటలు పంపడానికి ఉన్నాయా?" అని రామచందర్‌రావు ప్రశ్నించారు. తెలంగాణలో భాజపాను అధికారంలోకి తీసుకురావడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

తెలంగాణలో 90 లక్షల ఓట్లు డిలిట్

మొదటిపేజీ తరువాయి

జరిగిందని చెప్పారు.

జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా..

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నామని మహేశ్ గౌడ్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒత్తిడితోనే ఎన్నికల కమిషనర్ వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు.

జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలని రాహుల్ గాంధీ చెప్పారని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు..


ఈ నెల 6, 7 తేదీల్లో గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు టీపీసీసీ ఆధ్వర్యంలో ధర్నాలు,



ర్యాలీలు నిర్వహిస్తామని మహేశ్ గౌడ్ తెలిపారు. అక్టోబరు 8న లోక్‌భవన్ ఎదుట ఆందోళన చేపడతామని వెల్లడించారు.

హనీట్రాప్‌తో రిటైర్డ్ ఉద్యోగికి టోకరా..

మొదటిపేజీ తరువాయి



చాటింగ్ చేసి, ఆ సంభాషణలను అడ్డుపెట్టుకుని బెదిరింపులకు పాల్పడ్డాడు. మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బెదిరించాడు. పోలీసులమంటూ ఫోన్ కాల్స్ చేయడం, కేసులు పెడతామని భయపెట్టడం వంటి పద్ధతులతో బాధితుడి నుంచి దశలవారీగా భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. మొత్తంగా రూ.38 లక్షలు వసూలు చేసినట్లు కేసు దర్యాప్తులో వెల్లడైంది. మోసాన్ని గుర్తించిన బాధితుడు సైబర్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన 26 ఏళ్ల యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ సోషల్ మీడియా ఖాతాలు, ఫోన్ కాల్స్, చాటింగ్ ద్వారా బాధితుడిని ఎలా ట్రాప్ చేశాడనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో వృద్ధులను లక్ష్యంగా చేసుకుని నకిలీ సోషల్ మీడియా ఖాతాలతో సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మహిళల పేరుతో ఫేక్ ప్రొఫైల్స్ సృష్టించి ఫ్రెండ్ రిక్వెస్టులు పంపడం, పరిచయం పెంచుకుని నమ్మకం సంపాదించడం, ఆ తర్వాత వైద్యం, గృహ అవసరాలు, బహుమతులు వంటి కారణాలతో డబ్బులు డిమాండ్ చేయడం వంటి పద్ధతులను నేరగాళ్లు అనుసరిస్తున్నారని తెలిపారు.

డబ్బులు ఇచ్చిన తర్వాత లైంగిక వేధింపుల కేసులు, క్రిమినల్ కేసుల పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్నారని పోలీసులు పేర్కొన్నారు. కొందరు నిందితులు పోలీసుల మంటూ ఫోన్ చేసి బాధితులను భయపెట్టి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ కేసులో నిందితుడిపై ఐటీ చట్టంలోని 66సి, 66డి సెక్షన్లతో పాటు 308(2), 318(4), 319(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. సోషల్ మీడియాలో పరిచయం లేని వ్యక్తుల ఫ్రెండ్ రిక్వెస్టులను అంగీకరించే విషయంలో జాగ్రత్తగా ఉండాలని, బెదిరింపులకు భయపడి డబ్బులు చెల్లించకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో సీమంతం

- టీచర్లు, ఆయాలను సన్మానించిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి

పెద్దపల్లి బ్యూరో, అక్టోబరు 05 (డీడీ9 వార్త):

ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా రామగుండం పరిధిలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి గర్భిణీలకు సీమంతం నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలను శాలువాలతో సన్మానించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, సంక్షేమ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్వాడీ సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఊరగొండ అపర్ణ, జక్కుల పద్మ, పరకాల మురళి, పరకాల శ్రీలత, లగిశెట్టి సబిత, కందుల స్వరూప, జక్కుల బాలు, సిలారపు కళ్యాణ్, బరుపటి నారాయణ, ఎరుకొండ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



సింగరేణి కార్మికులకు దీపావళి కానుక

మొదటిపేజీ తరువాయి

కార్మికులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి సంస్థ తెలంగాణకు కొంగు బంగారమని పేర్కొన్నారు. సింగరేణి కేవలం బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదని.. తెలంగాణ ఆర్థిక పురోగతిలో కీలకమైన సంస్థ అని అన్నారు.

బొగ్గు ఉత్పత్తి పెంచాలి

సింగరేణి భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను కిషన్‌రెడ్డి ఆదేశించారు. సంస్థను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రత, ఉద్యోగ భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సంస్థ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అన్నారు.

రూ.60 వేల కోట్ల బకాయిలు

సింగరేణికి రావాల్సిన సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంస్థ ఆర్థికంగా బలోపేతం కావడానికి బకాయిల విడుదల అవసరమని పేర్కొన్నారు. మరోవైపు దసరా, దీపావళి పండుగల వేళ రూ.1,10,250 బోనస్ ప్రకటించడంతో సింగరేణి కార్మికుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి.

సామాన్యుడిపై ధరల భారం.. ప్రభుత్వం నిద్రమత్తులో ఉందా?

మొదటిపేజీ తరువాయి

ధ్వజమెత్తారు. కళ్లముందే ఈ దోపిడీ జరుగుతున్నా ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమన్నారు. బియ్యం మాత్రమే కాకుండా ఉల్లిపాయలు రూ.70, వెల్లుల్లి రూ.240, పల్లి నూనె రూ.210, పెసరపప్పు రూ.125, కందిపప్పు రూ.165 కు చేరుకోవడంతో సామాన్య కుటుంబాల వంటింటి బడ్జెట్ పూర్తిగా తలకిందులైందని తెలిపారు.

బ్లాక్ మార్కెటింగ్‌పై తక్షణమే దాడులు చేయాలని డిమాండ్

ధరల పర్యవేక్షణను గాలికి వదిలేసి ప్రభుత్వం కేవలం ప్రేక్షక పాత్ర పోషిస్తోందని హరీష్ రావు మండిపడ్డారు. వ్యాపారులు సృష్టిస్తున్న కృత్రిమ కొరత, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, అధిక మార్జిన్లపై తక్షణమే తనిఖీలు నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకుని సన్నబియ్యం సహా అన్ని నిత్యావసరాల ధరలకు అడ్డుకట్ట వేసి, పెరుగుతున్న ధరల భారం నుంచి సామాన్యుడికి ఉపశమనం కల్పించాలని ఆయన స్పష్టం చేశారు.

వాస్తవ లాభాలను ప్రకటించి సింగరేణి కార్మికులకు 40%వాటా వెంటనే ఇవ్వాలి .

- సింగరేణి సంస్థకి రూ 59 వేల కోట్ల బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలి.
- రక్షణ పరికరాలు పనిముట్లు కార్మికులకు అందజేయాలి.
- సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ.

డిడి9వార్త / రామగుండం అక్టోబర్ 6:

సింగరేణి యాజమాన్యం ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు పూర్తయిన ఇప్పటివరకు లాభాలు ప్రకటించకపోవడం కార్మికులకు రావలసిన లాభాల వాటా ప్రకటించడంతో ఈరోజు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా యాజమాన్యం కు మెమోరాండం ఇవ్వడం జరిగింది. దానిలో భాగంగా ఆర్జీవన్ జీడికే 11 ఇంక్లైన్ గని లోఏఐటీయూసీ ఫిట్ కమిటీ ఆధ్వర్యంలో గని మేనేజర్ కి మెమోరండం ఇవ్వడం జరిగింది.. ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి రంగు శీను మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు లాభాల వాటా ప్రకటించాలని మరియు రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి బకాయి పడిన సుమారు 59 వేల కోట్ల రూపాయలను వెంటనే చెల్లించాలని. మరియు దసరా పండుగ వరకు కార్మికులకు లాభాలు చెల్లించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు . రక్షణ పరికరాలు పనిముట్లు కార్మికులకు వెంటనే అందజేయాలని సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో, ఏఐటీయూసీ అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ గొడిశల నరేష్, తాళ్లపల్లి శ్రీనివాస్, గడ్డంబాలు, పొస్నం రంజిత్, బిట్టు తిరుపతి, దుర్గం శంకర్, నూతి మహేష్, కిరణ్, రామారావు, అడవి మల్లయ్య, శ్రీకాంత్, లక్ష్మణ్, వీరితోపాటు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనడం జరిగింది.





ఘనంగా కాక వెంకటస్వామి జయంతి వేడుకలు

- **కాక వెంకటస్వామి విగ్రహానికి పూలమాల వేసిన ప్రభుత్వ విప్ విజయరమణ రావు.**

డిడి9వార్త / పెద్దపల్లి అక్టోబర్ 6:

స్వర్గీయ మాజీ కేంద్రమంత్రి వర్యులు, పెద్ద పల్లి పార్లమెంట్ ముద్దుబిడ్డ కాకా గడ్డం వెంకటస్వామి 97వ జయంతిని పురస్కరించుకొని సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలోని వారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్, పట్టణ కౌన్సిలర్లు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, పట్టణ అధ్యక్షులు ,మండల అధ్యక్షులు,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, కాక అభిమానులు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.



ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి

- **తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి: కట్కూరి సందీప్**



పెద్దపల్లి బ్యూరో, అక్టోబరు 05 (డీడీ9 వార్త):

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన కట్కూరి సందీప్ అన్నారు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజలు తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునేలా చూడాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల కమిషన్ తీరుపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని లేదా ఆయనను సస్పెండ్ చేయాలని కోరారు. తొలగించారని ఆరోపిస్తున్న కోట్లాది ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఓటర్ల హక్కులను పరిరక్షించడంలో కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని సందీప్ కోరారు. కార్యక్రమంలో వెంకటేష్, ప్రశాంత్, కార్తీక్, శ్రీకాంత్, విజయ్, సలీం, రాజు, శ్రీనివాస్, రమేష్, శ్రీధర్, మల్లేష్, రాములు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- **హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరి.. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు**
- **ట్రాఫిక్ సీఐ బి. రాజేశ్వరరావు**



పెద్దపల్లి బ్యూరో, అక్టోబరు 05 (డీడీ9 వార్త):

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ట్రాఫిక్ సీఐ బి. రాజేశ్వరరావు కోరారు. రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్, ట్రాఫిక్ ఏసీపీ చి. శ్రీనివాస్ ఆదేశాల మేరకు స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడారు.

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ సిగ్నళ్లను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్‌కు పాల్పడవద్దని సూచించారు.


రోడ్లపై వాహనాలను ఇష్టారీతిన పార్కింగ్ చేయరాదని, దీనివల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాలు పెరిగే అవకాశం ఉందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సీఐ సూచించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహనం ఇచ్చిన యజమానిపై కూడా కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ తదితర పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు.

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐ ఎన్. రామరాజు పాల్గొన్నారు.

ప్రశాంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన బాలమణి–శ్రీనివాస్ దంపతులు

జనగామ అక్టోబర్ 5(డిడి 9వార్త)బ్యూరో

చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డిని జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి-శ్రీనివాస్ దంపతులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు అభినందనలు తెలిపి, ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందేలా కృషి చేయాలని కోరారు.



ఖని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్లక్ష్యంపై ఆర్టీఐ

- **ఎమ్మెల్యే నిధులు తెస్తుంటే.. అధికారులు సద్వినియోగం చేయడం లేదని ఆరోపణ**
- **సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేష్**

పెద్దపల్లి బ్యూరో, అక్టోబరు 05 (డీడీ9 వార్త):

గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా పేదలకు సరైన వైద్యం, మందులు అందడం లేదని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేష్ ఆరోపించారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువస్తున్నప్పటికీ.. ఆసుపత్రి అధికారులు వాటిని సక్రమంగా వినియోగించడం లేదని విమర్శించారు. ఆసుపత్రిలో ప్యాన్లు సరిగా పనిచేయడం లేదని, అత్యవసర విభాగంలో సరైన వెంటిలేషన్ లేక రోగులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, ఎక్స్‌రే, స్కానింగ్ పరికరాలు ఉన్నప్పటికీ సక్రమంగా పనిచేయడం లేదని ఆరోపించారు. రోగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని పేర్కొన్నారు. ఆసుపత్రిలో జరుగుతున్న నిర్లక్ష్యం, ఆర్థిక వ్యవహారాలపై వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో సోమవారం సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద దరఖాస్తు చేసినట్లు మడిపెల్లి మల్లేష్ తెలిపారు. అందులో 2020 నుంచి 2025 వరకు పలు అంశాలపై సమాచారం కోరినట్లు చెప్పారు.

ఆర్టీఐలో కోరిన వివరాలు:

ఆరోగ్యశ్రీ నిధులు: 2020-2025 మధ్య జీజీహెచ్‌కు వచ్చిన ఆరోగ్యశ్రీ నిధుల వివరాలు, వాటి ఖర్చులకు సంబంధించి హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ హెచ్‌డీఎస్ తీర్మానాల వివరాలు.


2021-2025 మధ్య లోకల్ పర్చేజ్ ద్వారా కొనుగోలు చేసిన మందులకు సంబంధించి ప్రభుత్వ సరఫరా అందుబాటులో లేదని తెలిపే నాన్‌అవైలబిలిటీ సర్టిఫికెట్లు తీసుకున్నారా? టెండర్ ప్రక్రియ, జిల్లా పర్చేజ్ కమిటీ అనుమతుల వివరాలు.

సర్జరీ విభాగంలో ల్యాప్రోస్కోపిక్ పరికరాలు ఉన్నాయా? వాటిని ఏ సంస్థ నుంచి కొనుగోలు చేశారు? ఆర్థోపెడిక్ ఇంప్లాంట్లు: 2020-2025 మధ్య రోగులకు వినియోగించిన ఇంప్లాంట్లను ఏ సంస్థ నుంచి కొనుగోలు చేశారు? కమిటీ ఆమోదించిన జాబితా ఉందా?

శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సేవలకు సంబంధించిన కాంట్రాక్టర్లు ఎవరు? ఎంతమంది సిబ్బంది పనిచేస్తున్నారు? వారి పేరోల్, జీతభత్యాల వివరాలు ఏమిటి?

ఉన్నతాధికారులు విచారణ చేయాలి

ఆర్టీఐ ద్వారా తాను కోరిన వివరాలు బయటకు వస్తే తనపై దాడులు చేయించడం లేదా తప్పుడు కేసులు పెట్టించే అవకాశం ఉందని మల్లేష్ ఆందోళన వ్యక్తం చేశారు. పేద ప్రజల కోసం ఎంత దూరమైనా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు.



ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కృషితో ప్రభుత్వం నుంచి నిధులు వస్తున్నప్పటికీ వాటిని సద్వినియోగం చేయకుండా పేద రోగులకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్న ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి నిర్వహణలో నిర్లక్ష్యం, అవకతవకలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల

- **ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు.**
- **రెండున్నర ఏళ్లలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.70 కోట్లు ఖర్చు చేశాం.**
- **గత ప్రభుత్వంలో 10 ఏళ్లు పాఠశాలల అభివృద్ధికి నోచుకోలేదు.**
- **రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు.**

డిడి9వార్త / పెద్దపల్లి అక్టోబర్ 6:

ఎలిగేడు మండలం రాములపల్లి వద్ద రూ. 200 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను సంబంధిత అధికారులు మరియు స్థానిక నాయకులతో కలిసి పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ...కుల మత బేధాలు లేకుండా అన్ని కులాలు, అన్ని మతాలు ఒకే వేదికపై పెద్ద ఎత్తున విద్యాభ్యాసం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేయడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాను శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత రెండున్నర సంవత్సరాలలో పెద్దపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి 70 కోట్లు నిధులు మంజూరు చేసి పాఠశాల భవనాలు, మరుగుదొడ్లు ప్రహరీ గోడలు నిర్మించడం జరిగిందని, గత ప్రభుత్వంలో 10 ఏళ్లు పరిపాలన చేసిన అప్పటి ఎమ్మెల్యే ప్రభుత్వ స్కూళ్లను ఏ మాత్రం పట్టించుకోకుండా తన ప్రైవేటు పాఠశాలలపైనే దృష్టి పెట్టారని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు విమర్శించారు. ఈ సందర్భంగా ఎలిగేడు మండలంలోని రామునిపల్లెలో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలను సోమవారం రోజున స్థానిక నాయకులతో కలిసి పరిశీలించడం జరిగిందని అన్నారు. మన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారు అని అన్నారు. అందులో భాగంగా రామునిపల్లెలో ఇంటర్నేషనల్ స్కూల్కు దీటుగా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం జరుగుతుందని 2560 మంది పిల్లలకు విద్య అందించడంతోపాటు హాస్టల్, ప్లే గ్రౌండ్, డైనింగ్ హాల్ నిర్మించడం జరుగుతుంది అన్నారు. ముఖ్యమంత్రి ఆలోచన మేరకు పేద పిల్లలు, మధ్యతరగతి పిల్లలు కార్పొరేటు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే వారికి టీపీఎఫ్, తెలంగాణ పబ్లిక్ స్కూల్ లలో దేశంలోని 29 రాష్ట్రాలలో ఎక్కడ లేని విధంగా సీఎం రేవంత్ రెడ్డి గ1మన రాష్ట్రంలోనే మిడ్ డే మీల్స్ తో పాటు అల్పాహారం కూడా గత రెండు మాసాల క్రితం ప్రారంభించడం జరిగింది అన్నారు. టిఫిన్ తో పాటు మూడు రోజులు పాలు మూడు రోజులు రాగి జావా కూడా ఇవ్వడం జరుగుతుంది అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థులకు హరే రామ హరే కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం కూడా ప్రారంభించడం జరిగింది అన్నారు. స్వాతంత్రం వచ్చి 80 సంవత్సరాలు అయిన ఇప్పటివరకు ఏ రాష్ట్రంలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు కాలేదని మన రాష్ట్రంలోనే ప్రారంభించుకోవడం జరిగింది అన్నారు. ఈ రాష్ట్రంలోని విద్యార్థులకు మంచి విద్యతో పాటు పౌష్టికారమైన ఆహారం అందించేందుకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వేలాది కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు అన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో నర్సరీ ఎల్ కేజీ చదివే పిల్లలకు 30 వేల నుంచి 40 వేలు సంవత్సరానికి ఖర్చు చేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నారని ఉపాధ్యాయులు కూడా నిష్ణాతులై బీఈడీ పట్టాలు పొంది ఉంటారని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. పిల్లల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని, సీఎం రేవంత్ రెడ్డి పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయలు నిధులు ఖర్చు చేస్తూ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నారు అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలకు విద్యా విధానంతో పాటు అన్ని సౌకర్యాలు కల్పన ధ్యేయంగా సీఎం అహర్నిశలు కృషి చేస్తున్నారు అన్నారు .ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, మండల పార్టీ అధ్యక్షులు, పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.









విద్యార్థుల విజయానికి ఉపాధ్యాయుల కృషే బలం...

- **100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతుల మీదుగా ఘన సన్మానం...**

అశ్వరావుపేట అక్టోబర్05 (డిడి 9 వార్త)

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అశ్వారావుపేట నియోజకవర్గంలో గత విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆధ్వర్యంలో గండుగులపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సన్మానించారు

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడం వెనుక ఉపాధ్యాయుల కృషి అంకితభావం ఎంతో కీలకమని అన్నారు విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించడంతో పాటు వారిలో క్రమశిక్షణ ఆత్మవిశ్వాసం ఉన్నత లక్ష్యాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం శ్రమిస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తించి గౌరవించడం మనందరి బాధ్యత అన్నారు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మంచి ఫలితాలు సాధిస్తున్నారని ఇందుకు ఉపాధ్యాయుల కృషి ప్రధాన కారణమని తెలిపారు అశ్వారావుపేట నియోజకవర్గంలో విద్యకు విద్యార్థుల భవిష్యత్తుకు మరింత ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే గారు స్పష్టం చేశారు ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలనే లక్ష్యంతో పాఠశాలల్లో అవసరమైన వసతుల కల్పనకు విద్యా ప్రమాణాల పెంపునకు తన వంతు సహకారం అందిస్తున్నానని ఇంకా అందిస్తానని తెలిపారు గత విద్యాసంవత్సరంలో పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలలకు మంచి పేరు తీసుకువచ్చిన ప్రధానోపాధ్యాయులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో మరిన్ని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు

దమ్మపేట ఎంఈఓ జగపతి రావు, ములకలపల్లి ఎంఈఓ సత్యనారాయణ, అశ్వారావుపేట ఎంఈఓ ప్రసాద్ రావు, చంద్రుగొండ ఎంఈఓ సూరయ్య, మాజీ ఎంఈఓ కీసరి లక్ష్మీ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





వచ్చేది కేసీఆర్ ప్రభుత్వం..
ఎగిరేది గులాబీ జెండానే..!

- **ఆరు గ్యారెంటీలు.. 420 హామీలు ఏమయ్యాయి?**
- **కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు – గంప రాంబాబు..**
- **హామీలు నెరవేర్చే వరకు పోరాటం ఆగదు..**
- **ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం..**
- **పత్రికలలో,మీడియాలో వార్తలు వచ్చినా అధికారులు స్పందించరా?**
- **గుడవర్తి నరసింహమూర్తి..**

అక్టోబర్ 05 – డీడీ9 వార్త, వెంకటాపురం.

ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశం కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతల తీవ్ర విమర్శలకు వేదికైంది. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, వందలాది హామీల అమలుపై బీఆర్ఎస్ మండల అధ్యక్షులు గంప రాంబాబు, సీనియర్ జిల్లా నాయకులు గుడవర్తి నరసింహమూర్తి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

ఎన్నికల సమయంలో హామీలతో ప్రజలను ఆకట్టుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇచ్చిన హామీల అమలులో ప్రజల అంచనాలను అందుకోవడంలో విఫలమైందని వారు ఆరోపించారు. “ఆరు గ్యారెంటీలు ఎక్కడ? 420 హామీలు ఎక్కడ? ప్రజలకు ఇచ్చిన మాటల పరిస్థితి ఏమిటి?” అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న హామీల అమలుకు కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాలని కోరారు.

“హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదు. ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తాం. అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం” అని గుడవర్తి నరసింహమూర్తి స్పష్టం చేశారు.

వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే.. ఎగిరేది గులాబీ జెండానే అని బీఆర్ఎస్ నాయకులు రాజకీయంగా ధీమా వ్యక్తం చేశారు.

వెంకటాపురంలో సమస్యలే సమస్యలు.. అధికారులపై బీఆర్ఎస్ ఆగ్రహం..

వెంకటాపురం మండలంలో అధ్వానంగా మారిన రహదారులు, విద్యుత్ సమస్యలు, రైతులకు సాగునీటి ఇబ్బందులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ఫిర్యాదులు, ఇసుక సొసైటీల్లో లోపాలపై సమావేశంలో చర్చించారు. అలాగే కొంతమంది ప్రధాన అధికారులు విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పత్రికల్లో, మీడియాలో వరుసగా వెలుగులోకి వచ్చినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

“ప్రజల సమస్యలు మీడియాలో వస్తున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదు? సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ఎవరిది?” అంటూ అధికార యంత్రాంగాన్ని ప్రశ్నించారు.

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి సంబంధిత అధికారులను నిలదీస్తామని హెచ్చరించారు.

దశలవారీ ఉద్యమానికి శ్రీకారం

వెంకటాపురం మండలంలోని ప్రధాన ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో దశలవారీ ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు నాయకులు ప్రకటించారు.







ఈ ఉద్యమంలో కలిసొచ్చే రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలను భాగస్వామ్యం చేసుకుని సమస్యల పరిష్కారం కోసం పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన పట్టభద్రులను గుర్తించి, వారి ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చిడెం రవికుమార్, అధికార ప్రతినిధి డ్రా దామోదర్, వెల్పూరి లక్ష్మీనారాయణ, జాగర శివాజీ, శాంతమూర్తి, మంచర్ల నాగేశ్వరరావు, బట్ట నాగేంద్ర, గడ్డం వివేక్ తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



దశ దిన కర్మలకు హాజరై ఆర్థిక సహాయంగా రూపాయలు 7000 /(ఏడు వేలు) అందించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

- **రాష్ట్ర మంత్రి వర్యులు సీతక్క ఆదేశాల మేరకు , జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సూచనలతో మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ నాయకులు**

తాడ్వాయిDD9 వార్త

తాడ్వాయి మండలం , కాల్వపల్లి గ్రామానికి చెందిన పీరీల గోవర్ధన్ ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందగా వారి దశ దిన కర్మకు హాజరై వారి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయంగా రూ. 7000/ (అక్షరాల ఏడు వేల రూపాయలు) అందించిన కాంగ్రెస్ నాయకులు

ఈ కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్యక్షులు (సింగిల్ విండో డైరెక్టర్) యాషాడపు మల్లయ్య , స్థానిక సర్పంచ్ కోరగట్ల సృజన వెంకన్న , గ్రామ కమిటీ అధ్యక్షులు సిద్ధబోయిన శ్రీనివాసు , ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు పురుషోత్తం నారాయణ , మాజీ ఉప సర్పంచ్ గోరగట్ల జగన్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అలం రామన్న , వార్డ్ మెంబర్ కొప్పుల కార్తీక్ , పీరిల శ్రావణ్ , కుమార్ , కొప్పుల కృష్ణారావు , ఆలం సతీష్ , సిద్ధబోయిన నర్సింగరావు , పీర్ల కృష్ణారావు , సిద్ధబోయిన రమేష్ , కొప్పుల నాగేష్ , తదితరులు పాల్గొన్నారు



సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వార్షిక లాభాల్లో 10%బోనస్ పెంచాలి..


- **మణుగూరు జీఎం కార్యాలయం ముందు ధర్నా - జీఎం రామచందర్ కు వినతిపత్రం సమర్పించిన ఐఎఫ్‌టీయూ.**

మణుగూరు. అక్టోబర్ 5 (డి డి 9వార్త)

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు 2025 26 సంవత్సరానికి గాను వచ్చిన వార్షిక లాభాల్లో 10% లాభాల బోనస్‌ను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ, సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (IFTU) ఏరియా అధ్యక్షుడు మంగీలాల్ ఆధ్వర్యంలో మణుగూరు జీఎం ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి, జీఎం రామచందర్ గారికి వినతిపత్రం సమర్పించడం జరిగింది.ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ... "202526 లో వచ్చిన లాభాల్లో వార్షిక బోనస్ ను ఈ దసరా పండుగకే 10% పెంచి కార్మికులకు ఇవ్వాలని, సింగరేణి లాభాలను ముందుగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.వచ్చిన లాభాలను ఇతర సంస్థల్లో పెట్టుబడులుగా పెడుతూ లాభార్జన చేస్తున్న సింగరేణి యాజమాన్యం, సింగరేణి పుట్టి పెరిగిన ప్రాంతంలోనే కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. వచ్చిన లాభాల్లో బోనస్ పెంచకుండా కొన్ని కేటగిరీలను మాత్రమే పట్టించుకుంటోంది. తక్షణమే లాభాల బోనస్ ను పెంచి ప్రకటించాలి, కోల్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ కు కూడా అమలు చేయాలి" అని డిమాండ్ చేశారు.

అలాగే లాభాల బోనస్ పై అక్టోబర్ 7న సింగరేణి హెడ్ ఆఫీస్, కొత్తగూడెం లో జరగనున్న ధర్నాను కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ఏరియా నాయకులు సాధనపల్లి రవి, అలివేలు, జిల్లా కాంతారావు,శ్రీకాంత్,సంజీవరావు, టి.రాము,తాటి వెంకటేశ్వర్లు,గుర్రపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అర్హులైన వారందరూ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు చేపించుకోవాలి ....

- **బిఆర్ఎస్ పార్టీ మండల కోఆర్డినేటర్ జూపల్లి రమణారావు గారి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం...**

అశ్వారావుపేట:అక్టోబర్05(డిడి 9వార్త)

అశ్వారావుపేట మండలంలోనీ ప్రతి గ్రామంలో స్థానిక నాయకులను కలిసి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు కార్యక్రమం పై అవగాహన కల్పించి అర్హులైన ఓటర్లను ఎన్రోల్మెంట్ చూపించే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్ మరియు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశానుసారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు రేగ.కాంతారావు మరియు అశ్వారావుపేట నియోజక వర్గ ఇంచార్జీ మాజీ ఎమ్మెల్యే మెచ్చ.నాగేశ్వర రావు సూచనల మేరకు రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని 2023 అక్టోబర్ నాటికి నాటికి డిగ్రీ మరియు డిప్లమో పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటుకు అర్హులనీ వీరందరినీ పట్టభద్రులను ఓటరుగా నమోదు చేయించేందుకు మండల పార్టీ ఆధ్వర్యంలో అవగాహన మరియు ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఓటర్ల నమోదు కొరకు

ఓటరు ఆధార్ కార్డు,గుర్తింపు కార్డు,

డిగ్రీ మెమో లను మాకు అందజేస్తే ఓటరు నమోదు చేయడం జరుగుతుంది. (గ్రాడ్యుయేట్స్) దరఖాస్తులను పూరింపజేసి,అవసరమైన ధ్రువపత్రాలను సేకరించి వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా

అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని పేరాయిగూడెం నందు ఏలేటి పార్వతి నివాసం నందు ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి,కొందరు గ్రాడ్యుయేట్ ఓటర్ల ఓటును నమోదు చేపించారు.

ఈ కార్యక్రమంలో మండల కో ఆర్డినేటర్ జూపల్లి.రమణారావు,మాజీ ఎంపీపీ జల్లిపల్లి. శ్రీరామమూర్తి, మాజీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు సంక.ప్రసాద్,మాజీ జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాష్ రావు,ఉట్లపల్లి మాజీ సర్పంచ్ సాధు.జ్యోత్స్న భాయ్,ఏలేటి.పార్వతి, నారాయణ,చిప్పనపల్లి.శ్రీను, తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.






ఘనంగా చేర్యాల AMC పాలకవర్గ పదవి బాధ్యత స్వీకారం

జనగామ అక్టోబర్ 5(డిడి9) వార్త

జనగామఈరోజు జనగామ నియోజకవర్గం చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గాకొమ్మూరి ప్రశాంత్ రెడ్డిపదవి బాధ్యత స్వీకారం కార్యక్రమంలో పాల్గొని శాలువాతో సత్కరించిన జనగామ కాంగ్రెస్ పార్టీ నాయకులు.ఈ సందర్భంగా జనగామ మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి AMC చైర్మన్ ప్రశాంత్ రెడ్డి శాల్వా తో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ఈ కార్యక్రమం లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మెరుగు బాలరాజు గౌడ్, దిశ సభ్యులు బక్క శ్రీనివాస్,జిల్లా కాంగ్రెస్ నాయకులు చెంచారపు బుచ్చి రెడ్డి,శివరాత్రి కుమార్, బనుక సిద్దిరాజ్ యాదవ్,మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బనుక ప్రభాకర్, ఉపాధ్యక్షులు మచ్చ కుమార్, సీనియర్ నాయకులు లక్ష్మణ్ నాయక్, రఘు గౌడ్,రాజు ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీ విద్యార్థి నేతకు ఇప్పపూల అశ్రునివాళి

- **కొమరం భీం స్ఫూర్తితో పోరాడిన యోధుడు సిద్ధబోయిన బిక్షపతి**

తాడ్వాయిడిడి9 వార్త

ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామంలోని అడవి తల్లి గర్భంలో పూసే ఇప్పపూలు రాలినట్టు, ఆదివాసీ ఉద్యమంలో ఒక నక్షత్రం రాలిపోయింది. మలిదశ ఆదివాసీ ఉద్యమంలో, మలిదశ తెలంగాణ పోరాటంలో తన జీవితాన్ని జాతి కోసం అంకితం చేసిన గొప్ప త్యాగశీలి, ఆదివాసీ విద్యార్థి నేత సిద్ధబోయిన బిక్షపతి అక్టోబర్ 4న అనారోగ్యంతో మరణించడం ఆదివాసీ సమాజానికి తీరని లోటు. కొమరం భీం స్ఫూర్తితో కోయ భుంకల్ తెగువతో నడిచిన బిక్షపతి జీవితం నేటి యువతకు, విద్యార్థులకు ఒక ఆదర్శం.

2006 మలిదశ తెలంగాణ పోరాటం నుండి తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం, ఆదివాసీ ప్రాంతంలో స్వయం పాలన రావాలని నినదించాడు. "మా భూములు మాకే కావాలి, మా నీళ్ళు మాకే కావాలి, మా ఉద్యోగాలు మాకే కావాలి, మాపాలన మాకే కావాలి" అంటూ జల్‌జంగిల్‌జమీన్ నినాదాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా ములుగు డివిజన్ అధ్యక్షుడిగా ప్రతి గూడెంకు తీసుకెళ్లాడు.

ఐటీడీఏ ప్రాంతాలను స్వయం పాలిత జిల్లా కౌన్సిల్ (Autonomous District Council)గా ప్రకటించాలని విద్యార్థి ఉద్యమాన్ని నడిపిన ధీరుడు ఆయన.

2007లో ఫారెస్ట్ అధికారుల బాలాజీ బంధంలో గోత్తికోయ గుడిసెలను కూల్చివేస్తే, అడ్డుకుని నిలబడ్డాడు. పౌరహక్కుల సంఘం ప్రతినిధులకు దారి చూపి, ప్రపంచానికి ఆదివాసీ గూడాలలో జరుగుతున్న దాడులను చాటి చెప్పాడు. ప్రజాస్వామిక తెలంగాణ ఆకాంక్ష కోసం ఆదివాసీ విద్యార్థి గెరిల్లా యుద్ధానికి సిద్ధమయ్యాడు.



తెలంగాణ పోరాట సమయంలో అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నాడు. పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగాడు. కేసులు పెట్టుకున్నాడు. 2008, 2011లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ధర్నాలు చేశాడు. ఐటీడీఏ ఏటూరునాగారంలో 29 శాఖల బలోపేతం కోసం, ఉద్యోగాలు ఆదివాసీ బిడ్డలకే రావాలని నిరంతరం పోరాడాడు.

తన ఉద్యోగ అవకాశాలను, తన భవిష్యత్తును సైతం జాతి కోసం త్యాగం చేసిన బిక్షపతి మరణం పట్ల తోటి ఉద్యమకారులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. అతని సహచర్యాన్ని మర్చిపోలేమని, అతని ఆశయ సాధన కోసం చివరి వరకు పోరాడుతామని ప్రతిజ్ఞ చేస్తున్నారు. ఆదివాసి జాతి కోసం తన జీవతం త్యాగం చేసి కొమరం భీమ్ లో కలసి పోయారు.

విద్యార్థి నేత బిక్షపతికి జోహార్

అడవి బిడ్డకు ఇప్పపూల అశ్రునివాళి

కీర్తిశేషులు కంప ఐలమ్మ గారి పార్థివ దేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించిన.. కాంగ్రెస్ పార్టీ నాయకులు & ప్రజా ప్రతినిధులు

మణుగూరు. అక్టోబర్ 5 (డి డి 9వార్త)

మణుగూరు మండలం లోని ముత్యాలమ్మ నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కంప రవి తల్లిగారైన కంప ఐలమ్మ గారు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు సోమవారం ఉదయం పరమపదించినారు. విషయం తెలిసిన వెంటనే పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు ,ప్రజాప్రతినిధులు వారి స్వగృహానికి వెళ్లి ఐలమ్మ గారి పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలవేసి, శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మణుగూరు మండల అధ్యక్షులు పిరునాకి నవీన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి & మాజీ సర్పంచ్ దొబ్బల వెంకటప్పయ్య, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





జనగామ అమ్మ ఫౌండేషన్

జనగాం అక్టోబర్ 5(డిడి9) వార్త

జనగామఈరోజు కీర్తిశేషులు రంగు నర్సయ్య జ్ఞాపకార్థం కుమారుడు రంగు మహేష్ గారు జనగామ జిల్లా ఏరియా ఆసుపత్రి వద్దకు వైద్యం కోసం వచ్చిన ప్రజలకు మహా అన్న సమర్పణ చేసి ఘనంగా తమ తండ్రిని స్మరించుకున్నారు*ఈ సందర్భంగా జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మంతెన మణికుమార్ ప్రధాన కార్యదర్శి వంగ భీమ్ రాజుగారు మాట్లాడుతూ ఈరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన రంగు నర్సయ్య కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు ప్రజలు యువత పెళ్లిరోజు జ్ఞాపకాలు సందర్భం ఏదైనా కానీ ఆకలితో ఉన్నవారికి ఒక పూట ఆకలి తీర్చి భారత దేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ మీ మీ గ్రామ స్థాయి పట్టణ స్థాయిలో యువత ఏకమై సామాజిక సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని యువతకు పిలుపు నిచ్చారు*ఈ సేవ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ కొయ్యడ రవి, తోకల హరీష్, గొల్లూరి చందు, బొల్లం కనకరాజు, ఎండి పాషా, సిద్ధిరాల చందు, మంద సాయి, ఎండి అప్రోజు, బింగి నరసింహులు, కొయ్యడ విశ్వ, సాయి తేజ్ సిద్ధిరాల, తదితరులు పాల్గొన్నారు



విష జ్వరాల విజృంభణతో పడకేసిన పల్లెలు

- **ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి**
- **పంచాయతీలలో పారిశుద్ధ్యం పై దృష్టి పెట్టాలి**
- **కొండబోయిన నాగేశ్వరరావు**

ఖమ్మం/కారేపల్లి, అక్టోబర్ 5 డిడి9 వార్త :


డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు విజృంభించడంతో పల్లెలు పడకేసి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, విష జ్వరాల నివారణకు ప్రభుత్వం ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించాలని పంచాయతీల్లో మురికి కాలువలు బాగు చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి దోమల నివారణ మందు పిచికారి చేసి పారిశుద్ధ్య పై దృష్టి పెట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం షేక్ బందే అలీ అధ్యక్షతన కారేపల్లి లో జరిగిన సిపిఎం గ్రామ శాఖ సమావేశాలు కొండబోయిన నాగేశ్వరావు మాట్లాడుతూ

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంచాయతీల్లో పారిశుద్ధం పనులు జరగక డెంగ్యూ, మలేరియా తదితర వైరల్ జ్వరాలు విపరీతంగా పెరుగుతున్నాయని తెలిపారు. అనేక గ్రామాల్లో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు, ముగ్గురు సభ్యులు జ్వరాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యం సకాలంలో అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు.

ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్న ప్రజలు పట్టణ ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోలేక గ్రామీణ వైద్యులు, ఆర్ఎంపీలను ఆశ్రయించాల్సి వస్తోందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాలు, మండల కేంద్రానికి సుదూరంగా ఉన్న గ్రామాలు అధికంగా ఉన్నందున ప్రభుత్వం మొబైల్ వైద్య వాహనాల ద్వారా ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కోరారు.

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (PHC)తో పాటు పల్లె దవాఖానాల్లో వైద్యులు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, రోగులకు జ్వరానికి తగిన వైద్యం, మందులు ఉచితంగా అందించాలని గ్రామ పంచాయతీల్లో నీటి నిల్వ లేకుండా మురికి కాలవలు బాగు చేసి బ్లీచింగ్ తో పాటు దోమల మందు పిచికారి చేసి పారిశుద్ధ్యం పనులపై దృష్టి పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో పార్టీ నాయకులు తలారి దేవప్రకాష్, శాఖ కార్యదర్శి అన్నవరపు కృష్ణ, కొండబోయిన ఉమావతి, ముండ్ల ఏకాంబరం, ముక్క సీతారాములు, ఎస్.కె. మహమ్మద్ పాషా, పాసిని నాగేశ్వరరావు, ఇల్లంగి పిచ్చయ్య కరికపల్లి రాయమల్లు, తదితరులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేట్ MLC ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంపై.. మంగళవారం (నేడు) నాడు కొత్తగూడెంలో ప్రత్యేక సమావేశం.

మణుగూరు. అక్టోబర్ 5 (డి డి 9వార్త)



మంగళవారం (06102026) మధ్యాహ్నం 3:00 గంటలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ MLC ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమంపై జిల్లాలోని 5 నియోజకవర్గాలకు చెందిన BRS పార్టీ ముఖ్య నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరుగుతుందని BRS పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు తెలియచేశారు.ఈ సమావేశానికి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జ్ & MLC తక్కెళ్ళపల్లి రవీందర్ రావు, మాజీ మంత్రి వర్యులు వనమా వెంకటేశ్వరరావు, బిఆర్ఎస్ పార్టీ గ్రాడ్యుయేట్ MLC అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు మెచ్చ నాగేశ్వరరావు, మాజీ శాసనసభ్యురాలు శ్రీమతి బానోతు హరిప్రియ, జిల్లా నాయకులు రావులపల్లి రాంప్రసాద్, భద్రాచలం నియోజకవర్గ నాయకులు మానె రామకృష్ణ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని రేగా కాంతారావు తెలిపారు.

గ్రాడ్యుయేట్ MLC ఎన్నికల్లో పార్టీ బలాన్ని మరింత పెంచేందుకు, అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరును గుర్తించి, ఓటరుగా నమోదు చేయించేలా కార్యాచరణ రూపొందించుకోవడం ఈ సమావేశం యొక్క ప్రధాన ఉద్దేశ్యం కావునా.. ఐదు నియోజకవర్గాలకు చెందిన BRS పార్టీ ముఖ్య నాయకులు, బాధ్యులు తప్పనిసరిగా హాజరై ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అక్రిడిటెడ్ కార్డుల మంజూరుపై ఆరోపణలు.. సమగ్ర విచారణకు డిమాండ్...!

- **భద్రాద్రి కొత్తగూడెంలో సుమారు 800 కార్డుల మంజూరుపై అనుమానాలు**
- **అర్హత లేని వారికి కార్డులు ఇచ్చారా..? నిజమైన వర్కింగ్ జర్నలిస్టులకు ఎందుకు అన్యాయం...?**
- **ఏపీఆర్ఓపై వస్తున్న ఆరోపణలపై కలెక్టర్ స్పందించాలి...**
- **అనర్హుల కార్డులు రద్దు చేసి అర్హులైన జర్నలిస్టులకు న్యాయం చేయాలి**

మణుగూరు. అక్టోబర్ 5 (డి డి 9వార్త)

అక్రిడిటెడ్ జర్నలిస్టు కార్డుల మంజూరు ప్రక్రియపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా దుర్గ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పెద్ద సంఖ్యలో అక్రిడిటేషన్ కార్డులు మంజూరయ్యాయనే అంశంపై ప్రజల్లో, జర్నలిస్టు వర్గాల్లో చర్చ జరుగుతోందన్నారు. జిల్లాలో సుమారు 800 వరకు అక్రిడిటెడ్ కార్డులు మంజూరైనట్లు పేర్కొంటూ, వాటి మంజూరు ప్రక్రియ, అర్హతలు, పత్రాల పరిశీలన, సర్క్యులేషన్ తదితర అంశాలపై పారదర్శకంగా విచారణ జరపాలని కోరారు.

అక్రిడిటెడ్ కార్డుల మంజూరులో అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులకు ప్రాధాన్యత లభించిందా లేదా అనే విషయాన్ని కూడా అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా కొన్ని వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, వాటి వాస్తవాలను అధికారిక విచారణ ద్వారా తేల్చాలని కోరారు.ఇటీవల ఇతర జిల్లాల్లో కూడా అక్రిడిటేషన్ వ్యవస్థకు సంబంధించి ఆరోపణలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో అధికారులు విచారణలు చేపట్టిన ఉదాహరణలను ప్రస్తావించిన దుర్గ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ ఇలాంటి ఆరోపణలపై జిల్లా యంత్రాంగం నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్డుల మంజూరుకు సంబంధించిన దరఖాస్తులు, పత్రాలు, పత్రికల సర్క్యులేషన్ వివరాలు,



వర్కింగ్ జర్నలిస్టుల హాజరు/పని చేస్తున్నట్లు నిర్ధారించే రికార్డులు, సంబంధిత కమిటీ నిర్ణయాలు తదితర అంశాలను పరిశీలించాలని ఆమె కోరారు.

విచారణలో అర్హత లేని వారికి అక్రిడిటెడ్ కార్డులు మంజూరైనట్లు తేలితే నిబంధనల ప్రకారం వాటిని రద్దు చేసి, నిజంగా పనిచేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

"వర్కింగ్ జర్నలిస్టులకు ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడ నేను ఉంటాను. ఏ యూనియన్‌తో సంబంధం లేకుండా, జర్నలిస్టుల హక్కుల కోసం నా వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తాను" అని దుర్గ స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్ అంకిత్ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని సమగ్ర విచారణకు ఆదేశించి, అక్రిడిటేషన్ ప్రక్రియలో పారదర్శకతను, నిజమైన వర్కింగ్ జర్నలిస్టులకు న్యాయాన్ని కల్పించాలని ఆమె కోరారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పెదగొల్లగూడెం విద్యార్థినులు

వాజేడు, అక్టోబర్ 5 (డీడీ9 వార్త):

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీన బండారిపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఏజీహెచ్ఎస్ పెదగొల్లగూడెం పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. వివిధ క్రీడా విభాగాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి పలు బహుమతులు సాధించడంతో పాటు జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు.

8వ తరగతి విద్యార్థిని తూర్పు అక్షర ట్రయథ్లాన్, లాంగ్‌జంప్, 400 మీటర్ల పరుగులో ప్రథమ బహుమతులు సాధించింది. 9వ తరగతి విద్యార్థిని బడే హర్షిని ట్రయథ్లాన్‌లో ప్రథమ బహుమతి, లాంగ్‌జంప్‌లో ద్వితీయ బహుమతి సాధించింది.

అదేవిధంగా 9వ తరగతి విద్యార్థిని బడే హర్షిత ట్రయథ్లాన్‌లో ద్వితీయ బహుమతి, లాంగ్‌జంప్‌లో తృతీయ బహుమతి, కిడ్స్ జావెలిన్ త్రో విభాగంలో ద్వితీయ బహుమతి సాధించింది. విద్యార్థినులు సాధించిన ప్రతిభ ఆధారంగా నవంబర్‌లో సంగారెడ్డిలో అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయస్థాయి అంతర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించారు.

విద్యార్థినుల విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇర్ప కేశవరావు, ఉపాధ్యాయులు పూనెం రోజారాణి, పాయం తిరుపతమ్మ, పెండకట్ల బుచ్చిబాబు, తోలేం కృష్ణయ్య, అట్టం రామారావు, కోడె భారతి, యాలం ఉమాదేవి, అరేం సౌజన్య, మైపతి రావు సృజన, గొంది కవిత, యాలం ధనలక్ష్మి, ఇర్ప గౌతమి తదితరులు, ఫిజికల్ డైరెక్టర్ గుండ్ల రాజు విద్యార్థినులను అభినందించారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదలతో విద్యార్థినులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమన్నారు. రాబోయే పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.




విద్యార్థినుల విజయానికి కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- **డివిజన్ అధికారులకు సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ ఆదేశాలు**

భద్రాచలం టౌన్, అక్టోబరు 5 (డీడీ 9వార్త)

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, భూ సమస్యలు, పింఛన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నిరుద్యోగం, వ్యక్తిగత సమస్యలు తదితర అంశాలపై ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. అర్జీలను సంబంధిత అధికారులకు పంపిస్తూ, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ సూచించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవడం ద్వారా వాటి పరిష్కారంతో పాటు అర్హత మేరకు ప్రభుత్వ పథకాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును ఆన్ లైన్ లో నమోదు చేసి సంబంధిత శాఖాధిపతులకు పంపాలని, ప్రతి ఫిర్యాదుపై అధికారులు వ్యక్తిగతంగా పర్యవేక్షణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎలాంటి దరఖాస్తులు పెండింగ్ లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్ పీవో సుధీర్, డీఏపో భగవాన్ రెడ్డితో పాటు భద్రాచలం డివిజన్ పరిధిలోని వివిధ శాఖల డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.




ఐటీడీఏ పీవోను కలిసిన రెడ్ క్రాస్ నూతన కార్యవర్గం

- **విద్యార్థులకు కంటి పరీక్షలు.. ఉచిత కంటి అద్దాల పంపిణీకి ఆమోదం**
- **పాల్వంచలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుకు సానుకూల స్పందన**

భద్రాచలం టౌన్, అక్టోబరు 5 (డీ డీ 9 వార్త)

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులు సోమవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ను ఆయన ఛాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వినతిపత్రం సమర్పించారు. దీనిపై పీవో సానుకూలంగా స్పందించారు. ఐటీడీఏ పరిధిలోని 63 ఆశ్రమ పాఠశాలలు, 32 గురుకుల కళాశాలల్లో చదువుతున్న సుమారు 25 వేల మంది విద్యార్థులకు ఈ నెల 9 నుంచి కంటి పరీక్షలు నిర్వహించేందుకు పీవో ఆమోదం తెలిపారు. అవసరమైన విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు అందించడంతో పాటు కంటి చూపు సమస్యలు ఉన్న వారికి శస్త్రచికిత్స శిబిరాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

అదేవిధంగా ఐఆర్ సీఎస్ ఆస్పత్రికి బయోకెమిస్ట్రీ ఎనలైజర్ అందించడం, తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా బాధితులకు సహాయం అందించడం వంటి కార్యక్రమాలకు సహకరిస్తామని రెడ్ క్రాస్ ప్రతినిధులు తెలిపారు. పాల్వంచలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, క్యాన్సర్ నిర్ధారణ కేంద్రం, మూత్రపిండాల వ్యాధిగ్రస్తుల కోసం డయాలసిస్ కేంద్రం, రక్తనిధి కేంద్రం ఏర్పాటుకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని పీవో సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ ఎస్ .ఎల్ . కాంతారావు, వైస్ చైర్మన్ చల్లగుళ్ల నాగేశ్వరరావు, ట్రెజరర్ తోటమల్ల బాలయోగి, స్టేట్ కమిటీ సభ్యుడు వై. సూర్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు పల్లంటి దేశప్ప, హరిశ్చంద్ర నాయక్ , బీబీజీ తిలక్ , ఎంబీ సర్వారెడ్డి, కండెలవాల సతీష్ , ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



గిరిజనుల విన్నపాలను త్వరితగతిన పరిష్కరించాలి

- **అర్హులైన వారికి నిర్ణీత గడువులోగా సంక్షేమ పథకాలు అందించాలి**
- **ఐటీడీఏ పీవో బి. రాహుల్**

భద్రాచలం టౌన్, అక్టోబరు 5 (డీ డీ 9 వార్త)

గిరిజనుల నుంచి స్వీకరించే ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఐటీడీఏ పీవో బి. రాహుల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్ లో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ చందన, ఎస్ డీసీ ఆనంద్ కుమార్, ఆర్ సీవో గురుకులం అరుణకుమారి, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏడీఎంహెచ్ వో సైదులతో కలిసి గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా భూ సమస్యలు, పోడు పట్టాలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, పింఛన్లు, గృహాలు, మౌలిక వసతులు, సామాజిక భద్రత తదితర అంశాలపై గిరిజనులు తమ సమస్యలను పీవో దృష్టికి తీసుకువచ్చారు. గిరిజనుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు గిరిజన దర్బార్ కీలక వేదికగా పనిచేస్తోందని రాహుల్ తెలిపారు. గిరిజన దర్బార్ లో వచ్చిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు. క్లిష్టమైన సమస్యలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేసి దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏపీవో పవర్ వేణు, పీవీటీజీ అధికారి గన్యా, ఏవో సున్నం రాంబాబు, జేడీఎం హరికృష్ణ, మిషన్ భగీరథ ఏఈఈ వసుంధర, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సౌజన్య, హౌసింగ్ ఏఈ హేమంత్, వివిధ విభాగాల సిబ్బంది నాగేశ్వరరావు, విజయ్, వెంకటేశ్వర్లు, ముత్యాలు, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



36 శాతం పైగా లాభాల వాటా వెంటనే ప్రకటించాలి.

- **సంస్థ సాధించిన వాస్తవ లాభాల్లో ఎలాంటి మినహాయింపులు చేయకుండా కార్మికుల ఖాతాల్లో జమ చేయాలి.**
- **ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి.**

మణుగూరు. అక్టోబర్ 5 (డి డి 9వార్త)

2025-26 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి కాలరీస్ సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, లాభాల్లో ఎలాంటి మినహాయింపులు చేయకుండా 36 శాతం పైగా లాభాల వాటాను కార్మికులకు ప్రకటించి, వారి బ్యాంకు ఖాతాల్లో తక్షణమే జమ చేయాలని మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి డిమాండ్ చేశారు.

టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం మణుగూరు ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లలో ఫిట్ సెక్రటరీల అధ్యక్షతన సంబంధిత అధికారులకు లాభాల వాటా డిమాండ్‌పై వినతి పత్రాలు అందజేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు నాగెల్లి తెలిపారు.

ఈ సందర్భంగా నాగెల్లి మాట్లాడుతూ..

గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో సింగరేణి వాస్తవ లాభాల్లో సుమారు రూ.6,300 కోట్లను అభివృద్ధి పేరుతో పక్కకు పెట్టి, మిగిలిన మొత్తంలో కేవలం 34 శాతం మాత్రమే కార్మికులకు లాభాల వాటాగా చెల్లించడం వల్ల కార్మికులకు అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. అభివృద్ధి పేరుతో పక్కకు పెట్టిన రూ.6,300 కోట్లు ఎక్కడ, ఏ పనులకు ఖర్చు చేశారో రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం శ్వేతపత్రం విడుదల చేసి కార్మికులకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సింగరేణి అభివృద్ధిలో కార్మికుల శ్రమే ప్రధానమని, ప్రాణాలను సైతం పణంగా పెట్టి రేయింబవళ్లు పనిచేస్తున్న కార్మికుల కష్టానికి తగిన ప్రతిఫలం అందించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాల్లో ఎలాంటి కోతలు, మినహాయింపులు లేకుండా వాస్తవ లాభాలను పరిగణనలోకి తీసుకుని 36 శాతం పైగా మెరుగైన లాభాల వాటాను కార్మికులకు అందించాలని కోరారు.

వాస్తవ లాభాలను తక్షణమే ప్రకటించి, 36 శాతం పైగా మెరుగైన లాభాల వాటా కోసం మంగళవారం మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్‌కు టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయనున్నట్లు నాగెల్లి తెలిపారు.

లాభాల వాటా ప్రకటనలో మరింత ఆలస్యం జరిగితే కేంద్ర టీబీజీకేఎస్ నాయకత్వం ఇచ్చే తదుపరి ఆదేశాల మేరకు కార్మికుల హక్కుల





సాధన కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో తదుపరి కార్యక్రమాలను చేపడతామని నాగెల్లి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బంగారి పవన్ కుమార్, మునిగేల నాగేశ్వర రావు, సుద్దాల సంపత్ కుమార్, జంగం రాజ్ కుమార్, చిరుత వెంకటేశ్వర్లు, గూగులోత్ రమేష్, నాయక్ దిశెట్టి రమేష్, ముత్యం, బాలాజీ, సర్వే నరేష్ జ్యోతి, అజ్మీరా అశోక్, ఇమ్రాన్,కళ్యాణ్ కుమార్ రాము, గఫూర్, మహేష్,శ్రీను, కుమార స్వామి,రవి, బీరయ్య, సతీష్ నాయుడు, రాజేష్, నాగేశ్వర రావు పూర్ణ చందర్, తక్కిఉద్దీన్ తో పాటు పెద్ద ఎత్తున టి బి జి కె యస్ కార్యకర్తలు, శ్రేణులు పాల్గొన్నారు.

ముళుగు జిల్లాకి కేటాయించిన స్పెషల్ కోర్టును ఏటునాగారంలో ఏర్పాటు చెయ్యాలి

- **ఆదివాసి విద్యార్థి సంఘం డిమాండ్**

తాడ్వాయి డిడి9 వార్త



ములుగు జిల్లాలోని ఏటూర్ నాగారం తాడ్వాయి మంగపేట కన్నాయిగూడెం వాజేడు వెంకటాపురం ప్రజలకు అందుబాటులో ఉంటుంది

ములుగు జిల్లాకు G.O.Ms.No.59 ద్వారా మంజూరైన నూతన Additional Junior Civil Judgecum Additional Judicial Magistrate of First Class Court ను ఏటూరునాగారంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్న ఆదివాసీ విద్యార్థి సంఘం

ది.24092026న తెలంగాణ ప్రభుత్వం G.O.Ms.No.59 ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 200 నూతన Additional Junior Civil JudgecumAdditional Judicial Magistrate of First Class Courts మంజూరు చేసింది. అందులో భాగంగా ములుగు జిల్లాకు ఒక నూతన కోర్టు మంజూరైంది.

ప్రస్తుతం ములుగు జిల్లా పరిధిలోని వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం, మంగపేట, తాడ్వాయి మరియు ఏటూరునాగారం మండలాలకు చెందిన ప్రజలు న్యాయ సేవల కోసం ములుగు జిల్లా కేంద్రానికి 60 నుండి 120 కి.మీ. వరకు ప్రయాణించాల్సి వస్తోంది. దీనివల్ల కక్షిదారులు, సాక్షులు, మహిళలు, వృద్ధులు మరియు గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ప్రయాణ భారాన్ని ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా సాక్షులను కోర్టుకు హాజరుపరచడంలో పోలీసు శాఖకు కూడా సమయం, సిబ్బంది పరంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

ఏటూరునాగారం ఈ ప్రాంతంలోని ఆరు మండలాలకు భౌగోళికంగా అనుకూలమైన కేంద్ర స్థానం. ఏటూరునాగారంలో కోర్టు ఏర్పాటు చేస్తే వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం, మంగపేట, తాడ్వాయి మరియు ఏటూరునాగారం మండలాల ప్రజలకు ములుగు వెళ్లాల్సిన దూరం గణనీయంగా తగ్గుతుంది. ముఖ్యంగా మారుమూల గ్రామాల ప్రజలకు సత్వరంగా, తక్కువ ఖర్చుతో న్యాయ సేవలు పొందే అవకాశం కలుగుతుంది.

అంతేకాకుండా ఏటూరునాగారం పోలీస్ డివిజన్ పరిధిలోనే ఈ కోర్టు ఉండటం వల్ల పోలీసు అధికారులు, సాక్షులు మరియు దర్యాప్తు సిబ్బంది కోర్టు వ్యవహారాలకు హాజరు కావడం కూడా సులభతరం అవుతుంది.

అందువల్ల ప్రజలకు న్యాయం అందుబాటులో ఉండటం, ప్రయాణ దూరం తగ్గడం, గ్రామీణ మరియు మారుమూల ప్రాంతాల ప్రజలకు సులభమైన న్యాయ సేవలు అందించడం, పోలీసు మరియు న్యాయ వ్యవస్థల మధ్య సమన్వయం మెరుగుపడటం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని, ములుగు జిల్లాకు G.O.Ms.No.59 ద్వారా మంజూరైన నూతన కోర్టును ఏటూరునాగారం మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయించేందుకు సంబంధిత ప్రభుత్వ అధికారుల దృష్టికి మా అభ్యర్థనను తీసుకెళ్లవలసిందిగా మనవి చేస్తున్నాము.ఇది ఏటూరునాగారం ప్రాంత ప్రజలకే కాకుండా, ములుగు జిల్లాలోని మొత్తం ఏజెన్సీ ప్రాంత ప్రజలకు న్యాయ సేవలను మరింత చేరువ చేసే నిర్ణయంగా ఉంటుంది రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్నిబిల్లి గణేష్ అన్నారు

ఖాళీ కడుపుతో పారిశుద్ధ్య పనులు చేయాలా?

- **మూడు నెలలుగా వేతనాలు లేక పస్తులుంటున్న కార్మికులు**
- **ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మెరుపు నిరసన**
- **వారం రోజుల్లో బకాయిలు చెల్లిస్తామని సూపరింటెండెంట్ హామీ**

భద్రాచలం , అక్టోబరు 5 (డిడి9 వార్త):

మూడు నెలలుగా వేతనాలు అందక తాము, తమ కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అలాంటప్పుడు ఖాళీ కడుపుతో పారిశుద్ధ్య పనులు ఎలా చేయాలని సీఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ ప్రశ్నించారు. భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, ఇతర తాత్కాలిక ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మెరుపు నిరసన చేపట్టారు. ఆసుపత్రి ప్రధాన గేటు ఎదుట ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా ఏజే రమేష్ మాట్లాడుతూ.. ఆసుపత్రి పారిశుద్ధ్య పనుల గుత్తేదారు గత ఏడాది కాలంగా కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ.18,500 చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.11 వేలే చెల్లిస్తున్నారని, ఆ మొత్తాన్ని కూడా సకాలంలో ఇవ్వకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

గతంలోనూ ఇదే సమస్య తలెత్తడంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డీసీహెచ్ రవీంద్రనాయక్ దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. నాలుగు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రోజూ 500 నుంచి 800 మంది వరకు ఓపీ రోగులు వస్తుంటారని, అందుకు అనుగుణంగా పారిశుద్ధ్య సిబ్బంది లేకపోవడంతో ఉన్న కార్మికులపై పని భారం పెరుగుతోందని పేర్కొన్నారు.

కార్మికుల వేతనాలను నేరుగా వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్మిక నాయకులు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డితో చర్చలు జరిపారు. వారం రోజుల్లోగా పెండింగ్ వేతనాలు చెల్లించి సమస్యను పరిష్కరిస్తామని సూపరింటెండెంట్ హామీ ఇవ్వడంతో కార్మికులు నిరసన విరమించారు.

కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ బండారు శరత్‌బాబు, శానిటేషన్ యూనియన్ నాయకులు ఎం.రమ, నరేందర్, నాగరాజు, కృష్ణ, శోభ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీఐ దరఖాస్తుదారుడికి పొంతన లేని సమాధానం!

- **పూర్తి సమాచారం ఇవ్వలేదంటూ దరఖాస్తుదారుడి అసంతృప్తి...**
- **విద్యాశాఖ తీరుపై తీవ్ర విమర్శలు**

బోనకల్,అక్టోబర్ 05, (డీడీ9 వార్త):

సమాచార హక్కు చట్టం కింద కోరిన సమాచారానికి పూర్తి వివరాలు ఇవ్వకుండా, అడిగిన అంశాలకు పొంతన లేని సమాధానం ఇచ్చారంటూ దరఖాస్తుదారు మండల విద్యాశాఖ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నుంచి వచ్చిన సమాధానంలో తాను కోరిన కీలక సమాచారానికి స్పష్టత లేకపోవడంతో ఆర్టీఐ చట్టం ఉద్దేశమేంటి? సమాచారం అడిగితే అసంపూర్తి సమాధానాలెందుకు? అంటూ ప్రశ్నిస్తున్నారు.

బోనకల్ మండలంలోని పాఠశాలల్లో ప్రైమరీ స్కూల్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి సంబంధించిన పూర్తి వివరాలు కోరుతూ దరఖాస్తు చేసినప్పటికీ,అధికారులు ఇచ్చిన సమాధానంలో అసలు కోరిన సమాచారాన్ని పూర్తిగా వెల్లడించలేదని దరఖాస్తుదారు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ఎవరెవరు దరఖాస్తు చేశారు? వారి అర్హతలు ఏమిటి? ఎవరి ఆధారంగా ఎంపిక చేశారు? ఇంటర్వ్యూలు ఎలా నిర్వహించారు? ఎంపికకు అనుసరించిన ప్రమాణాలేమిటి? వంటి కీలక అంశాలపై స్పష్టమైన వివరాలు ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.అధికారులు మాత్రం 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల వివరాలను ఆర్డీఓకు పంపినట్లు పేర్కొన్నప్పటికీ,ఆ జాబితా వివరాలు,ఎంపికకు సంబంధించిన పూర్తి ఆధారాలు, ప్రక్రియపై స్పష్టత ఇవ్వకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని దరఖాస్తుదారు అంటున్నారు.

అడిగింది ఒకటి.. చెప్పింది మరొకటి!

ఆర్టీఐ ద్వారా ఒక నిర్దిష్ట సమాచారాన్ని కోరితే, దానికి సంబంధం లేని వివరాలతో సరిపెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. సమాచారం ఇవ్వాల్సిన అధికారులు సమాచారాన్ని దాచిపెట్టేలా వ్యవహరిస్తే పారదర్శకత ఎక్కడ ఉంటుంది? అని నిలదీస్తున్నారు. పూర్తి సమాచారం ఇవ్వకుండా అసంపూర్తి సమాధానంతో వ్యవహారాన్ని ముగించేందుకు ప్రయత్నించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కోరిన ప్రతి అంశానికి స్పష్టమైన, పత్రాధారాలతో కూడిన పూర్తి సమాచారాన్ని ఇవ్వాలని.. లేకపోతే సమాచార హక్కు చట్టం ప్రకారం ఉన్నతాధికారులను ఆశ్రయిస్తామని దరఖాస్తుదారు పేర్కొంటున్నారు.పాఠశాలల్లో పోస్టుల భర్తీవంటి అంశాల్లో పారదర్శకత అత్యంత కీలకమని, ఎంపిక ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



పేదల వైద్యానికి 'ఐటీడీఏ' చేయూత

- **ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**
- **పీఓ బి రాహుల్ చొరవతో ఆసుపత్రికి మహర్దశ**
- **పేదలకు మెరుగైన వైద్యం కోసం... రూ.15 లక్షల పరికరాలు అందజేత**
- **ఐటీడీఏ నిధులతో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి ఆధునిక వైద్య సదుపాయాలు**

భద్రాచలం , అక్టోబరు 5 (డిడి9 వార్త):

నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలందిస్తున్న భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు ఐటీడీఏ నిధులతో రూ.15 లక్షల విలువైన వైద్య పరికరాలను సమకూర్చారు. ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆధ్వర్యంలో సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డికి పరికరాలను అందజేశారు.

కంటి పరీక్షల పరికరం, బ్లడ్ టెస్టింగ్ మిషన్, ఈసీజీ మిషన్, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, ట్రేలు, ఆక్సిజన్ సిలిండర్లు తదితర అత్యవసర వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందుబాటులోకి వచ్చిన పరికరాలను సద్వినియోగం చేసుకుని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు.

ఐటీడీఏ పీవో బి.రాహుల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులు, వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఐటీడీఏ నిధులతో సమకూర్చిన పరికరాల ద్వారా భద్రాచలం ఏరియా ఆసుపత్రికి వచ్చే రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, ఐసీయూ ఇన్‌చార్జి డాక్టర్ జగదీష్, డాక్టర్ మల్లేష్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పూర్‌లో పేదల సొంతింటి కలకు తొలి అడుగు

నిజామాబాద్, అక్టోబర్ 5 (డీడీ9 వార్త):

పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఉప్పూర్ గ్రామంలో మరో ముందడుగు పడింది. కమ్మర్‌పల్లి మండలం ఉప్పూర్ గ్రామంలో నూతనంగా మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు సోమవారం ఘనంగా శ్రీకారం చుట్టారు. లబ్ధిదారు వెంచిర్యాల నర్సు ఇంటి నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ ఏనుగందుల శైలేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శైలేందర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఉప్పూర్ గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంలో సహకరించిన బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్‌కు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి లబ్ధిదారు వెంచిర్యాల నర్సుతో పాటు గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు డాక్టర్ నరేష్, వార్డు సభ్యుడు దాసరి రాకేష్, నాయకులు సాధుల్లా, క్రాంతి రెడ్డి, రవీందర్, అనిల్, అంజనేయులు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



చదువుకు పేదరికం అడ్డుకాకూడదు బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్

- **సాయిచరణ్‌కు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేత**

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం

అక్టోబర్ 05: (డిడి 9 వార్త న్యూస్):

బోథ్ మండలం: పేదరికం కారణంగా ఏ ఒక్క ప్రతిభావంతుడైన విద్యార్థి కూడా ఉన్నత చదువులకు దూరం కాకూడదని బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు.

నీట్ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి కొమురం భీం ఆసిఫాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు దక్కించుకున్న స్థానిక విద్యార్థి ఇర్నాల సాయిచరణ్ ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని ఆయన చలించిపోయారు. విద్యార్థి కళాశాల ఫీజులు, ఇతర ఖర్చుల నిమిత్తం తన వంతుగా రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందించారు.

ఈ సందర్భంగా తుల శ్రీనివాస్ మాట్లాడుతూ, చదువుకోవాలనే తపన, ప్రతిభ ఉన్న నిరుపేద విద్యార్థులకు సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. పూసలు అమ్ముకునే నిరుపేద కుటుంబం నుంచి వచ్చి ప్రతిష్టాత్మక మెడికల్ సీటు సాధించిన సాయిచరణ్ పట్టుదల ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ నిరుపేద విద్యార్థుల విద్యాభ్యాసానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఆయన భరోసా ఇచ్చారు.

కేసీఆర్ గారు ఇచ్చిన డబుల్ బెడ్ రూమ్ లోనే ఉంటూ, కెసిఆర్ ప్రతి జిల్లాలో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలోని సీటు సంపాదించడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలను ఏర్పాటు చేసి ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ ఇవ్వడం వల్లే, సాయి చరణ్ మెడికల్ కళాశాలలో సీటు సంపాదించాడని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కేసీఆర్ చేపట్టిన అనేక కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలిపారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో విద్యార్థులు ఇబ్బందులు పడలేదని, కానీ ప్రస్తుత ప్రభుత్వంలో విద్యార్థులు స్కాలర్ షిప్ లు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.. కాగా తమ కుమారుడి ఉన్నత చదువుకు పెద్ద మనసుతో అండగా నిలిచిన మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్‌కు విద్యార్థి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బండారి శ్రీధర్ రెడ్డి, బోథ్ పట్టణ అధ్యక్షుడు అల్లకొండ ప్రశాంత్,మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, బొడ్డు శ్రీనివాస్, వీడిసి అధ్యక్షుడు అల్లకొండ పోతన్న,సిరిసే సంజీవ్,రాకేష్ రెడ్డి, రోహిత్, ప్రవీణ్, ఇఫతేకర్,మల్లెపూల విజయ్ కుమార్,గంగామల్లు,రాజకుమార్ బీఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.






ఇంటిలిజెన్స్ ఏఎస్ఐగా మొహమ్మద్ సలీంకు పదోన్నతి

- **అభినందించిన రావినూతల మాజీ సర్పంచ్ ఎస్.కె. వజీర్,**

బోనకల్,అక్టోబర్ 05,(డీడీ9 వార్త):

మధిర ఇంటిలిజెన్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రావినూతల గ్రామానికి చెందిన మొహమ్మద్ సలీంకు పదోన్నతి లభించింది. ఆయనను ఇంటిలిజెన్స్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ)గా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రామితుల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎస్.కె. వజీర్‌తో పాటు కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, స్నేహితులు సలీంను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తూ ఉన్నతాధికారుల ప్రశంసలు పొందిన సలీంకు పదోన్నతి రావడం ఆనందదాయకమని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. పదోన్నతి సందర్భంగా సలీంకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు.



లయన్స్ ఇంటర్నేషనల్ అవార్డు గ్రహీత

- **లయన్ పోలవరపు బసవేశ్వర రావుకు ఘన సన్మానం**

కోటగిరి అక్టోబర్ 05 (డిడి9 వార్త):

నిజామాబాద్ జిల్లా లయన్స్ ఇంటర్నేషనల్ ప్రతిష్టాత్మక అవార్డును దక్కించుకున్న ప్రముఖ సామాజిక కార్యకర్త, లయన్ పోలవరపు బసవేశ్వర రావును కోటగిరిలో ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సంస్థలో ఆయన చేసిన విశేష సేవలను గుర్తిస్తూ ఈ అంతర్జాతీయ పురస్కారం లభించింది.
ఈ సందర్భంగా స్థానిక లయన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి డైమండ్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరావు పటేల్, తెల్ల రవికుమార్ పాల్గొని లయన్ బసవేశ్వర రావును శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.
సమాజ సేవలో కోటగిరి డైమండ్ లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని, బసవేశ్వర రావు లాంటి వారికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం తమ క్లబ్‌కు ఎంతో గర్వకారణమని ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆయన సేవలు భవిష్యత్తులో మరెందరికో స్ఫూర్తిగా నిలుస్తాయని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మొరం అనుమతి ఇవ్వాలి

- **ప్రజావాణిలో బీర్కూర్ నాయకుల ఫిర్యాదు**

బాన్సువాడ, అక్టోబర్ 5(డిడి9 వార్త):


ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన మొరం తరలింపునకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ కామారెడ్డి జిల్లా బీర్కూర్‌కు చెందిన నాయకులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మియాపురం శశికాంత్, ఏఎంసీ ఉపాధ్యక్షులు యమ రాములు, మాజీ ఎంపీపీ గాండ్ల రఘు, అశోక్ పాల్గొని అధికారులకు వినతిపత్రం సమర్పించారు.
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు అవసరమైన మొరం అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు అనుమతులు మంజూరు చేయాలని వారు కోరారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మౌలిక వనరుల విషయంలో లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



మోర్తాడ్ ఆసుపత్రిలో ప్రసవ సేవలకు గ్రహణం..!

నిజామాబాద్, అక్టోబర్ 5 (డిడి 9 వార్త):

పరికరాలు సమకూర్చినా ప్రసవ సేవలు ఎందుకు నిలిపివేశారంటూ మోర్తాడ్ మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌పై స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రశ్నించారు. ఆసుపత్రిలో సాధారణ, సిజేరియన్ ప్రసవ సేవలు నిలిచిపోవడంపై సోమవారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గతంలో మోర్తాడ్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రసవ సేవలు ప్రస్తుతం నిలిచిపోవడంతో నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆసుపత్రిలో అవసరమైన పరికరాలు లేవని సిబ్బంది తెలిపిన నేపథ్యంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లక్షల రూపాయల విలువైన ఆపరేషన్ థియేటర్, విద్యుత్, ఆక్సిజన్ తదితర పరికరాలను సమకూర్చినా సేవలు పునరుద్ధరించలేదని తెలిపారు. ప్రసవ సేవలను వెంటనే పునరుద్ధరించి, అవసరమైన వైద్య సిబ్బందిని నియమించి మోర్తాడ్ ప్రభుత్వ ఆసుపత్రిని బలోపేతం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు వై. రాజేశ్వర్ రెడ్డి, బి. శ్రీనివాస్, బి. రాజేష్, కె. సందీప్ కుమార్, కె. ప్రదీప్, బి.టి. గంగారం, బి. సుదర్శన్, డి. మురళి, టి. దీపక్, డి. గోవర్ధన్ తదితరులు ఫిర్యాదు చేశారు.



తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: అక్టోబర్ 05: (డిడి 9 వార్త న్యూస్):

తెలంగాణ ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షులు ఎస్కే మహమూద్ గారు మరియు ఉపాధ్యక్షులు అమృత్ పాటిల్ గారు తెలంగాణ ఉద్యమకారుల వినతి పత్రాన్ని గౌరవ ఎంపీడీవో గారికి ఇవ్వడం జరిగింది 250 గజాల స్థలం మరియు ఇల్లు మరియు పెన్షన్ ఇచ్చి ఉద్యమకారులందరినీ ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈ యొక్క వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

దుమ్ముతో ఉక్కిరిబిక్కిరి.. లారీలతో రహదారి దిగ్బంధం...!

- **CSP కాట వద్ద ప్రజల ప్రాణాలతో చెలగాటమా...?**
- **ప్రధాన రహదారికి ఇరువైపులా లారీల నిలుపుదలతో ప్రమాద ముప్పు**
- **బొగ్గు ధూళితో ప్రజారోగ్యానికి ముప్పు.. అధికారుల పర్యవేక్షణ కరువు...?**
- **ఓల్డ్ స్టోర్ ప్రాంతంలో పార్కింగ్ ఉన్నా రోడ్డుపైనే లారీల మకాం...!**





మణుగూరు. అక్టోబర్ 5(డి డి 9వార్త)

మణుగూరు CSP కాట సమీపంలోని ప్రధాన రహదారి ప్రజలకు నరకప్రాయంగా మారిందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవైపు భారీ వాహనాల రాకపోకలు.. మరోవైపు రహదారికి ఇరువైపులా లారీల నిలుపుదల.. దీనికితోడు రోడ్డుపై పేరుకుపోయిన మట్టి, బొగ్గు ధూళి. వాహనం కదిలితే చాలు దుమ్ము మేఘంలా ఎగిసిపడి రహదారిని కమ్మేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి.
దీంతో ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, పాదచారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుమ్ము కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయం నెలకొంది.
ప్రధాన రహదారేనా.. లేక లారీలకు పార్కింగ్ స్థలమా...?
అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. రహదారికి ఇరువైపులా లారీలను నిలిపివేయడంతో రోడ్డుకు అందుబాటులో ఉన్న వెడల్పు తగ్గిపోతోంది. ఫలితంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడటమే కాకుండా అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజన్లు ఇతర అత్యవసర వాహనాలు సైతం వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తే పరిస్థితి కనిపిస్తోంది.

పార్కింగ్‌కు స్థలం ఉన్నా.. రోడ్డుపైనే లారీలు ఎందుకు...?

లారీల పార్కింగ్ కోసం సింగరేణి యాజమాన్యం ఓల్డ్ స్టోర్ ప్రాంతంలో ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసినప్పటికీ, ప్రధాన రహదారిపైనే లారీలను నిలిపివేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రత్యేక పార్కింగ్ ప్రాంతం ఉన్నప్పుడు రహదారిని పార్కింగ్ స్థలంగా మార్చాల్సిన అవసరం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.
ప్రధాన రహదారిపై లారీలు నిలిపివేయకుండా సింగరేణి సెక్యూరిటీ విభాగం, పోలీస్ శాఖ సమన్వయంతో కఠినమైన పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలుp కోరుతున్నారు.

దుమ్ము కాదు.. ప్రజారోగ్యంపై దాడి...!

రోడ్డుపై పేరుకుపోయిన బొగ్గు ధూళి, మట్టి, దుమ్ము వాహనాల రాకపోకలతో గాలిలో కలుస్తుండటంతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. నిరంతరం దుమ్ము ఎగిసే పరిస్థితిని కేవలం ట్రాఫిక్ సమస్యగా కాకుండా ప్రజారోగ్యం, రహదారి భద్రతకు సంబంధించిన అత్యవసర సమస్యగా అధికారులు పరిగణించాల్సిన అవసరం ఉంది.
ఈ నేపథ్యంలో సామాజిక కార్యకర్త కర్నే బాబురావు సోమవారం నాడు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా మణుగూరు MPDOకు వినతిపత్రం సమర్పించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

అధికారులకు స్పష్టమైన డిమాండ్లు

CSP కాట సమీపంలోని ప్రధాన రహదారిపై క్రమం తప్పకుండా నీటిని చల్లి దుమ్ము ఎగరకుండా చూడాలని కోరారు. రహదారిపై పేరుకుపోయిన దుమ్ము, బొగ్గు ధూళి, మట్టిని యంత్రాల సహాయంతో నిరంతరం తొలగించాలని విజ్ఞప్తి చేశారు.
రహదారికి ఇరువైపులా లారీలను ఇష్టానుసారంగా నిలిపివేయకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, ఓల్డ్ స్టోర్‌లో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
అలాగే మున్సిపాలిటీ, పోలీస్, ట్రాఫిక్, సింగరేణి యాజమాన్యం, సెక్యూరిటీ విభాగం మరియు సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన నిర్వహించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.
అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ సూచికలు ఏర్పాటు చేసి, అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజన్లు వంటి అత్యవసర వాహనాలకు ఎలాంటి ఆటంకం లేకుండా నిర్బంధ రహిత మార్గం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.
"ప్రజలు ప్రతిరోజూ ఎదుర్కొంటున్న సమస్యను అధికారులు కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలి. దుమ్ము, లారీ పార్కింగ్ సమస్యలకు తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలి" అని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పట్టభద్రులు తమ ఓట్లు నమోదు చేసుకోవాలి

- **అఫీషియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొడ్డు శ్రీధర్**

శంషాబాద్ అక్టోబర్ 05(డీడీ9 వార్త):



హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల యూనిట్ కొరకు జరగబోయే పట్టభద్రుల శాసన మండలి సభ్యుడి ఎన్నికల సందర్భంగా ప్రతి యొక్క పట్టభద్రుడు తన ఓటుని నమోదు చేసుకోవాలని, ప్రతి ఓటు విలువైనది, సామాజిక బాధ్యతగా ప్రజాస్వామ్య విలువలను కాపాడడం కోసం ఓటు నమోదు బాధ్యత అందరి మీద ఉందని ఆర్య వైశ్య అఫీషియల్స్ మరియు ప్రొఫెషనల్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొడ్డు శ్రీధర్ సూచించారు. ఈ సందర్భంగా ఆఒపా ఆధ్వర్యంలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, ఓటర్ నమోదు కొరకు తమ ఆధార్ కార్డు, ఓటర్ ఐడి కార్డు మరియు డిగ్రీ సర్టిఫికేట్ జత పరుస్తు సంప్రదించ గలరని రంగారెడ్డి జిల్లా ఆ ఒ పా అధ్యక్షుడు బొడ్డు శ్రీధర్ మనవి చేస్తూ 9552567224, 9121980792, 9890041486, నెంబర్లకు సంప్రదించగలరని కొరడ మైనది.

సూరవీడు పంచాయతీపై కాంగ్రెస్ పట్టు..!

- **తాత్కాలిక సర్పంచ్‌గా కొర్సా ప్రసాద్.. ఉప సర్పంచ్‌గా గోగు నరసింహారావు**

అక్టోబర్ 05, డీడీ9 వార్త – వెంకటాపురం

ములుగు జిల్లా వెంకటాపురం మండలం సూరవీడు గ్రామపంచాయతీలో జరిగిన తాత్కాలిక సర్పంచ్, ఉప సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యం సాధించింది. ఎనిమిది మంది వార్డు సభ్యులు హాజరైన ఎన్నికల్లో ఐదుగురు కాంగ్రెస్ సభ్యుల మద్దతుతో కొర్సా ప్రసాద్ తాత్కాలిక సర్పంచ్‌గా, గోగు నరసింహారావు ఉప సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.
గత సర్పంచ్, ఉప సర్పంచ్‌లు సస్పెన్షన్‌కు గురైన నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు మధ్య ఎన్నిక నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్‌లను శాలువాలతో సత్కరించి అభినందించారు.







కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలి..

- **అఖిలపక్ష పార్టీల డిమాండ్.**
- **పట్టణంలో భారీ నిరసన ర్యాలీ.**

మణుగూరు. అక్టోబర్ 5(డి డి 9వార్త)

రాజ్యాంగ హక్కులను పరిరక్షిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా కొనసాగుతున్న SIR ప్రక్రియలో జరుగుతున్నాయని ఆరోపిస్తున్న అవకతవకలను నిరసిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్ష పార్టీల ఆధ్వర్యంలో మణుగూరులో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.
ఏఐసిసి, ఇండియా కూటమి, ఆదేశాలమేరకు పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పిలుపుతో మణుగూరు మండల, పట్టణ కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంల్ మాస్ లైన్ పార్టీ నాయకులు, అఖిలపక్షంగా ఏర్పడి ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.
మణుగూరు సెంటర్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా కొనసాగుతూ అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుంది. అక్కడ అఖిలపక్ష పార్టీల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.
SIR ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించాలని, అర్హులైన ప్రతి ఓటరుకు చెందిన ఓటు హక్కుకు ఎలాంటి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వారు పేర్కొన్నారు.
ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి నమ్మకం కలిగించేలా ఎన్నికల సంఘం వ్యవహరించాలని, ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలని నాయకులు డిమాండ్ చేశారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించకుండా, ప్రతి పౌరుడికి తన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు.
ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలు ఐక్యంగా ముందుకు సాగాలని, రాజ్యాంగ హక్కులు మరియు ఓటు హక్కు పరిరక్షణకు నిరంతరం పోరాడాలని అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు.
ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, పట్టణ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, సిపిఐ డివిజన్ సెక్రటరీ సరెడ్డి పుల్లారెడ్డి, సిపిఎం జిల్లా నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి దొబ్బల వెంకటప్పయ్య, సిపిఐ ఎంల్ మసాలైన్ నాయకులు మధుసూదన్ రెడ్డి,సిపిఐ మండల సెక్రెటరీ జక్కుల రాజబాబు, సిపిఎం మండల సెక్రెటరీ సత్రపల్లి సాంబశివరావు, సిపిఐ టౌన్ సెక్రటరి దుర్గ్యాల సుధాకర్, జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు బోసగిరి శివసైదులు, సారపు రాంరెడ్డి, సిపిఐ జిల్లా సమైక్య అధ్యక్షులు మున్నా లక్ష్మి కుమారి,మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు కూరపాటి సౌజన్య, మైనార్టీ అధ్యక్షులు ఎండి రహీమ్ పాషా, సర్పంచ్ లు పాల్వంచ రాములు, కారం పూజిత, ఉపసర్పంచ్ లు గాండ్ల సురేష్, కనకయ్య,మణుగూరు మండల, పట్టణ కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, సిపిఐ ఎంల్ మాస్ లైన్ పార్టీ నాయకులు, జిల్లా నాయకులు, మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, INTUC ప్రతినిధులు, లారీ యూనియన్ నాయకులు, బొగ్గు ముఠా కార్మికులు, గుమాస్తాల సంఘం ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు, అఖిలపక్ష నాయకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఓటు హక్కును కాపాడేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు.

బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

- ఇంటిగ్రేటెడ్ కార్యాలయం ఏర్పాటు చేయాలి
- డయాలసిస్ సెంటర్‌ను పునరుద్ధరించాలి
- ఇచ్చోడలో 30 పడకల CHC సెంటర్ మంజూరు చేయాలి
- ఫారెస్టు అధికారుల వైఖరితోనే ఆదిలాబాద్ జిల్లా వెనక్కి నెట్టేయబడుతుంది
- ఫారెస్టు అధికారులే అభివృద్ధిని అడ్డుకుంటున్నారు
- నెరడిగొండ మరియు బజార్ హత్నూర్ మండల అటవీ సమస్యలకు పరిష్కారం చూపాలి

ఆదిలాబాద్ జిల్లా బ్యూరో : (డిడి9 వార్త న్యూస్)





సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు.

నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మరియు గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. బోథ్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక అంశాలపై *బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు మరియు గృహ నిర్మాణ శాఖ మంత్రి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రస్తావించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ

బోథ్ మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి వస్తే ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, వేగంగా అందుతాయని తెలిపారు.అలాగే బోథ్ నియోజకవర్గ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న పరిపాలనా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ డిమాండ్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా గతంలో బోథ్ కు మంజూరు అయిన డయాలసిస్ సెంటర్ ను తరలిపోవడంతో కిడ్నీ వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని బోథ్‌లోనే డయాలసిస్ సెంటర్‌ను తిరిగి మంజూరు*చేసి, సేవలను పునరుద్ధరించాలని కోరారు. ఇచ్చోడ మండల కేంద్రంలో రోగుల సంఖ్య పెరగడంతో 30 పడకల CHC సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు.

మండలాల్లో గిరిజనేతరులు అటవీ అధికారుల పట్ల పడుతున్న ఇబ్బందులను దృష్టి పెట్టుకొని వారికి అటవీ హక్కు పట్టాలను అందించాలని కోరారు. బోథ్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన ఈ అయిదు ప్రధాన అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, త్వరితగతిన



ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- అదనపు కలెక్టర్ భుజంగరావు ఆదేశం
- ప్రజావాణికి 107 ఫిర్యాదులు

నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 05(డీడీ9 వార్త) :

ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందిన ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇస్తూ వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వి.భుజంగరావు అధికారులను ఆదేశించారు. సోమవారం నిజామాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన అధికారులతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా స్థాయిలోనే కాకుండా సీఎం ప్రజావాణికి వచ్చిన అర్జీలను సైతం ఎప్పటికప్పుడు పరిశీలించి, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వచ్చిన విన్నపాలపై డీఆర్ఓ గీత, జడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్‌డీఓ సాయన్న తదితరులతో కలిసి దరఖాస్తులను స్వీకరించారు. రోజంతా కలిపి మొత్తం 107 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాల సందర్భంగా ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో కార్యక్రమాలు చేపట్టి, ఆర్టీఐ చట్టంపై చైతన్యం పెంపొందించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ నెల 7న నిజామాబాద్‌కు రాష్ట్ర బీసీ కమిషన్

నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 05(డీడీ9 వార్త) :

జిల్లాలోని పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న సామాజిక బహిష్కరణ ఘటనలపై బాధితుల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించేందుకు తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ ఈ నెల 7న నిజామాబాద్‌కు రానున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌తో పాటు సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, డాక్టర్ బాలలక్ష్మిలు ఈ పర్యటనలో పాల్గొని బాధితులతో నేరుగా మాట్లాడతారని పేర్కొన్నారు. ఈ నెల 7న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు బాధితుల నుంచి కమిషన్ ప్రతినిధులు వినతులు స్వీకరిస్తారని కలెక్టర్ వివరించారు. బాధితులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని కమిషన్‌ను నేరుగా కలసి తమ ఫిర్యాదులు అందజేయవచ్చని సూచించారు.





విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

- ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి పిలుపు
- కలెక్టరేట్‌లో ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం
- జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 05(డీడీ9 వార్త) :

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవ్వగా, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య nనాయకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల కంటే ప్రభుత్వ ఉపాధ్యాయులకే బోధనా నైపుణ్యాలు ఎక్కువని కొనియాడారు. బడులలో మౌలిక వసతుల కోసం ప్రభుత్వం రూ. కోట్లు వెచ్చిస్తోందని, నిజామాబాద్ జిల్లాలోనే మరుగుదొడ్లు, మూత్రశాలల కోసం రూ. 21 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, మోడల్ స్కూళ్ల ద్వారా ప్రభుత్వం నాణ్యమైన విద్యనందిస్తోందన్నారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. విద్యా రంగానికి ప్రభుత్వం బడ్జెట్‌లో పెద్దపీట వేసిందని, బడులలో పెరిగిన విద్యార్థుల సంఖ్యే దీనికి నిదర్శనమన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. ఆధునిక పద్ధతుల్లో ఎఫ్ఎల్ఎన్ విధానంపై దృష్టి పెట్టి విధి నిర్వహణలో నిబద్ధత చూపాలని, విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.





భీమ్ గల్‌లో ఉద్రిక్త వాతావరణం

- బంద్‌కు ఎమ్మెల్యే పిలుపు

నిజామాబాద్, అక్టోబర్ 5 (డీడీ9 వార్త):



భీమ్ గల్ పట్టణ కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో హోటల్ వ్యాపారి పొలాస సుధాకర్ ఆత్మహత్యాయత్నం ఘటనపై మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమ్ గల్ ఎస్సై తిరుపతి వేధింపులే సుధాకర్ ఆత్మహత్యాయత్నానికి కారణమని ఆరోపించారు. పోలీస్‌స్టేషన్‌లోనే సుధాకర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం అత్యంత బాధాకరమని, బాల్కొండ నియోజకవర్గంలో ఖాకీ ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని విమర్శించారు. ఎస్సై తిరుపతిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి విధుల నుంచి డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. భీమ్ గల్, బాల్కొండ, మోర్తాడ్ ఎస్సైల తీరుపై కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేకపోయిందని అన్నారు. అధికార దుర్వినియోగం, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న పోలీసు అధికారులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుధాకర్ ఆత్మహత్యాయత్నంలో పోలీసుల ప్రమేయం లేదని సీపీ ప్రకటించడం పూర్తిగా బాధ్యతారాహిత్యమని విమర్శించారు. సీపీ వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం భీమ్ గల్ పట్టణ కేంద్రంలో బంద్ నిర్వహించాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

భీంగల్ స్టేషన్ ఘటనలో పోలీసుల ప్రమేయం లేదు

- సీపీ సాయి చైతన్య

నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 05(డీడీ9 వార్త) :



భీంగల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న ఘటనలో పోలీసుల ప్రమేయం ఏమీ లేదని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. బాధితుడిని భీంగల్‌కు చెందిన పీ. సుధాకర్‌గా గుర్తించినట్లు తెలిపారు. అతను పాత బస్టాండ్ సమీపంలో టీ స్టాల్ నడుపుతున్నాడని, అతని షాపు ఎదురుగా ఉన్న కిరాణా షాపు యజమాని తన వద్ద సిగరెట్లు కొనడం లేదనే నెపంతో ఇద్దరు రిపోర్టర్లతో బెదిరించాడని పేర్కొన్నారు. అలాగే రాత్రి వేళల్లో అలస్యంగా షాపు నడుపుతుండటంతో పోలీసులు డ్యూటీలో భాగంగా అతడిపై పెట్టీ కేసు నమోదైందన్నారు. రిపోర్టర్ల బెదిరింపులను మనసులో పెట్టుకుని సుధాకర్ స్టేషన్ వద్దకు వచ్చి ఆత్మహత్యాయత్నం చేసినట్లు వెల్లడించారు. స్టేషన్ సిబ్బంది వెంటనే మంటలు ఆర్పి ఆస్పత్రికి తరలించారని, ఈ ఘటనతో పోలీసు వ్యవస్థకు ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదని తేల్చి చెప్పారు.

దుర్గామాత నవరాత్రులకు డీజేలపై నిషేధం

దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో డీజే, హైపై సౌండ్ సిస్టమ్‌లపై పూర్తి నిషేధం విధించినట్లు జిల్లా పోలీస్ కమిషనర్ తెలిపారు. ఉత్సవ నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, చందా వసూళ్ల కోసం ప్రజలను బలవంతం చేయవద్దని స్పష్టం చేశారు. రాత్రి 10 గంటల తర్వాత లౌడ్ స్పీకర్లు పూర్తిగా ఆపివేయాలని, మైక్ పర్మిషన్ కోసం సంబంధిత ఏసీపీని సంప్రదించాలని సూచించారు. మండపాల వద్ద నాణ్యమైన విద్యుత్ వైరింగ్, వర్షం పడితే తడవకుండా పాలిథిన్ కవర్లు, అగ్నిప్రమాదాల నివారణకు నీళ్లు, ఇసుక బకెట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. మహిళలు, యువతులపై ఈవ్‌టీజింగ్ జరగకుండా, అస్సాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా నిఘా ఉంచాలని, అత్యవసరమైతే డయల్ 112 లేదా కంట్రోల్ రూమ్ నంబరు 8712659700ను సంప్రదించాలని కోరారు.

వీబీజీ రామ్ జీ వర్క్స్‌పై సమీక్ష సమావేశం

ఆదిలాబాద్ జిల్లా: సోనాల మండలం: అక్టోబర్ 05: (డిడి 9 వార్త న్యూస్):

ఈరోజు వీబీజీ రామ్ జీ వర్క్స్‌పై సమీక్ష సమావేశాన్ని సోనాల మండల ఎంపీడీఓ నిర్వహించారు పంచాయతీ కార్యదర్శులతో,ఎంపీ ఓ, ఏపీ ఓ, ఈ సి టి ఏ,ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మెట్లు తో,మీటింగ్ తీసుకోవడం జరిగినది. లేబర్ ప్రతి గ్రామపంచాయతీలో 50 పైన వివిజి రాంజీ పథకంలో పని చేయవలసి ఉంటుంది ప్రతి గ్రామపంచాయతీలో ఇంకుడు గుంతలు ఫారం పనులు ఊరకుంట ఊర చెరువు పనులు సకాలంలో స్టార్ట్ చేసి పూర్తి చేయవలెను. హౌస్ టెక్స్ ట్రేడ్ లైసెన్సు శానిటేషన్ ఇందిరమ్మ ఇండ్లు పనులు ముందంజలో ఉండాలని సూచించారు.



రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దు

- 22-ఏ నిషేధిత భూ సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలి
- -ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి
- రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం

నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 05(డీడీ9 వార్త) :

22ఏ నిషేధిత భూములకు సంబంధించి ప్రజలు, రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులపై సత్వరమే స్పందించి పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఐడీఓసీ సమావేశ మందిరంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డితో కలిసి రెవెన్యూ అధికారులు, తహసిల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూభారతి చట్టం మార్గదర్శకాలను పాటిస్తూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి దరఖాస్తులను వారం నుంచి పది రోజుల్లోగా పరిష్కరించాలన్నారు. అర్హులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని, రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని స్పష్టం చేశారు. భూభారతి, సాదాబైనామా పెండింగ్ అర్జీల పరిష్కారంలోనూ జాప్యం వద్దన్నారు. చెరువుల శిఖం భూములు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన చోట పకడ్బందీగా సర్వే జరిపి హద్దులు నిర్ధారించాలన్నారు. ఫారెస్ట్‌రెవెన్యూ భూ వివాదాలపై త్వరలోనే జాయింట్ సర్వే నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5 గంటల తర్వాత ఇసుక రవాణా చేసే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్ ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వాహనాలు, మౌలిక వసతులు సిద్ధం చేయాలని సూచించారు.నిజామాబాద్, బోధన్ పట్టణాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో పారిశుధ్య కార్మికులకు ప్రాధాన్యం ఇచ్చామని సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈ భేటీలో అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్ఓ గీత, ఆర్‌డీఓలు తదితరులు పాల్గొన్నారు.







కోటగిరిలో అర్హులైన లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ.

కోటగిరి అక్టోబర్ 05 (డిడి9 వార్త) :

నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం కోటగిరి మండల కేంద్రంలోని చావిడి వద్ద సోమవారం నూతనంగా మంజూరైన డిజిటల్ రేషన్ కార్డులను అర్హులైన లబ్ధిదారులకు ఘనంగా పంపిణీ చేశారు.మండల ఎమ్మార్వో కే.గంగాధర్,స్థానిక సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు బర్ల మధుకర్ అధ్యక్షతన ప్రజా ప్రతినిధులు,నాయకుల చేతుల మీదుగా లబ్ధిదారులకు స్వయంగా రేషన్ కార్డులను అందజేశారు.కొత్తగా డిజిటల్ రేషన్ కార్డులు అందుకోవడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కోటగిరి మండల అధ్యక్షులు షాహిద్ హుస్సేన్, పిఏసిఎస్ కోటగిరి చైర్మన్ కూచి సిద్దయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ కులకర్ణి అనిల్,ఉప సర్పంచ్ అలీన తఫీన్, ఆర్ఐ సునీల్ రెడ్డి,నాయకులు కొట్టం మనోహర్,బీర్కూర్ గంగాధర్,గ్రామ పెద్దలు,గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

ఆదిలాబాద్ జిల్లా: బోథ్ మండలం: అక్టోబర్ 05: (డిడి 9 వార్త న్యూస్):

నేడు బోథ్ మండల కేంద్రంలోని రైతులతో కలిసి ఈ ఏడాది జూన్, జూలై ప్రారంభంలో కురిసిన వర్షాలకంటే అతి తక్కువగా కురవడం ఇదే విదంగా ఎలినినో ప్రభావం మూలంగా అతి తక్కువ వర్షపాతం నమోదు కావడంతో జూన్ నుండి సెప్టెంబర్ వరకు కురువ వలసిన వర్షపాతం కంటే అతి తక్కువగా అంటే 32 శాతం వరకు లోటుగా ఉంది. ఈ ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు తెలంగాణ రాష్ట్రం మొత్తంగా చూస్తే మన ఆదిలాబాద్ జిల్లాలో పత్తి పంట సాగు విస్తీర్ణం తగ్గేలా మరియు అతి తక్కువ వర్షపాతం నకు తగ్గట్టుగా సోయబిన్, పెసర, మినుములు, బొబ్బరా, చిక్కుడు నువ్వులు సూర్యపువ్వులు, ఆముద పంటలు వేసేలా . 2026లో ఆదిలాబాద్ జిల్లాను కరువు ప్రభావిత జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేయడానికి బలమైన ఆధారాలు ఉన్నాయి.

సెప్టెంబర్ 9, 2026 నాటికి ఆదిలాబాద్‌లో 597 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదై, సాధారణ 899 మి.మీ.తో పోలిస్తే 34% లోటు నమోదైంది. 20 మండలాల్లో 20-49% వరకు లోటు ఉన్నట్లు నివేదికలు పేర్కొన్నాయి.

అంతేకాక, ఆగస్టు 2026లో ఆదిలాబాద్‌లో సాధారణ 294.8 మి.మీ.కు గానుకేవలం 77 మి.మీ. వర్షపాతం నమోదై 74% లోటు నమోదైంది.

ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం కరువు ప్రభావిత మండలాల జాబితాను పరిశీలిస్తున్నట్లు, ఆదిలాబాద్ జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలి. జిల్లాలోని కరువు ప్రభావిత మండలాలను గుర్తించి, రైతులకు పంట నష్టపరిహారం, పంట రుణాల రీషెడ్యూలింగ్ మాఫీ, రుణ వసూళ్ల నిలిపివేత, ఇన్‌పుట్ సబ్సిడీ, పశుగ్రాసం-తాగునీటి ఏర్పాట్లు, ఉపాధి హామీ పనుల పెంపు వంటి తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. ఇందులో పాల్గొన్న రైతులు రవి, కృష్ణ, రాజు, సుభాష్, రాములు తదితరులు పాల్గొన్నారు.



ఎత్తోండలో ఘనంగా గ్రంథాలయ ప్రారంభోత్సవం

కోటగిరి, అక్టోబర్ 5:(డిడి9 వార్త): నిజామాబాద్ జిల్లా



గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువత ఉన్నత విద్యావంతులుగా ఎదగడానికి పుస్తక పఠనం ఎంతో దోహదపడుతుందని కోటగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) విష్ణు, సార్ ఎత్తోండ గ్రామ సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ పేర్కొన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల పరిధిలోని ఎత్తోండ గ్రామ పంచాయతీలో హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ సౌజన్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని (లైబ్రరీ) వారు రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ భవన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ శ్వేతా సూర్యకాంత్ మాట్లాడుతూ, గ్రామంలోని నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేందుకు ఈ లైబ్రరీ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. నేటి డిజిటల్ యుగంలో పిల్లలు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంటూ, పుస్తక పఠనాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తును కాంక్షిస్తూ ఉచితంగా పుస్తకాలను అందించిన హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ నిర్వాహకులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం కోటగిరి ఎంపీడీవో విష్ణు సార్ మాట్లాడుతూ, విద్యార్థులందరూ చిన్నతనం నుంచే చదువుపై ప్రత్యేక ఆసక్తి కనబరచాలని సూచించారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా సాధారణ జ్ఞానాన్ని, సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కోరారు. ఫౌండేషన్ వారు ఎంతో ఉదారతతో ఏర్పాటు చేసిన ఈ గ్రంథాలయంలోని ప్రతి పుస్తకాన్ని విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువత సంపూర్ణంగా సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు మరియు పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కోటగిరి ఎంపీపీఎస్ పాఠశాలలో నూతన తరగతి గది ప్రారంభం

కోటగిరి అక్టోబర్ 05(డిడి9 వార్త):

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ రచ్చగల్లి పాఠశాలలో దాతల సహకారంతో నిర్మించిన నూతన తరగతి గదిని సోమవారం ఘనంగా ప్రారంభిం చారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఈ తరగతి గది నిర్మాణానికి విరాళాలు అందించిన ప్రముఖులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.ఎపిక్ సిస్టమ్స్ ఇండియాస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో కలపాల విజయ్ కుమార్,హెచ్ఆర్ లక్ష్మి, అలాగే హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ హైదరాబాద్ ఫౌండర్ డాక్టర్ సీహెచ్ హిమజా రెడ్డి,రవి తేజ,రాజు తదితరులు ఈ కార్యక్రమానికి హాజరై నూతన తరగతి గదిని ప్రారంభిం చారు.విద్యార్థుల చదువు కోసం దాతలు ముందుకు వచ్చి సహాయం చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బర్ల మధుకర్,ఎంపీడీవో జీ.విష్ణు,ఎంఈఓ నాదెండ్ల శ్రీనివాస రావు, పాఠశాల హెచ్ఎం డి.ఉదయ్ చందర్, కులకర్ణి కృష్ణ, ,కొత్తపల్లి రమేష్,పార్వతి, మోహన్, గణేష్ మేదం,శ్రావణ్, పి హెచ్ ఎం ప్రభాకర్, బాబు,అశోక్,రిటైర్డ్ ,వార్డ్ సభ్యులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా పి. నాగ్‌నాథ్ ఎంపిక

- **జెడ్పీహెచ్ఎస్ పోతంగల్ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం**
- **అభినందించిన కలెక్టర్, డీఈఓ, ప్రజాప్రతినిధులు**

పోతంగల్, అక్టోబర్ 05 (డిడి9 వార్త):



జెడ్పీహెచ్ఎస్ పోతంగల్‌లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు పి. నాగ్‌నాథ్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, డీఈఓ, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించి అభినందించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, విద్యారంగంలో అందిస్తున్న సేవలను గుర్తిస్తూ పి. నాగ్‌నాథ్‌కు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి గౌరవం దక్కడం పట్ల తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించి, మరింతగా విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

ఉపాధ్యాయుడి సేవలకు గుర్తింపు


ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల కృషికి లభించే ఇలాంటి గుర్తింపులు విద్యార్థులకు మరింత మెరుగైన విద్య అందించేందుకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంఈఓ సాయిలు, ఉపాధ్యాయులు సూదం వెంకటేష్ తదితరులు పాల్గొని పి. నాగ్‌నాథ్‌ను అభినందించారు.

సాలంపాడ్‌లో ఉచిత కంటి, షుగర్ వైద్య శిబిరం

బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 05(డిడి9 వార్త) :

సాలూర మండలంలోని సాలంపాడ్ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సేవ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి మరియు షుగర్ పరీక్షల శిబిరం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు లయన్ కుమ్మరి పోశెట్టి నేతృత్వంలో జరిగిన ఈ శిబిరంలో వైద్యులు డాక్టర్ అజయ్ గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాంపు ఇన్‌ఛార్జ్ లయన్ హనుమంత్ రావు, గ్రామ సర్పంచ్ శీలం నర్మదా సంతోష్ రెడ్డి, ఉపసర్పంచ్ సత్తార్, మాజీ ఎంపీపీ గైని పెద్ద గంగారాం, జీపీ కార్యదర్శి రఘుపతి రెడ్డి, గ్రామ పెద్దలు శీలం సంతోష్ రెడ్డి, ఎఫ్ఏ షాదుల్లా తదితరులు పాల్గొన్నారు.



బోధన్ చెక్కి చెరువు వద్ద బతుకమ్మ ఏర్పాట్లు చేపట్టాలి

బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 05(డిడి9 వార్త) :

ఈ నెల 11న జరిగే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని బోధన్ పట్టణంలోని చెక్కి చెరువు వద్ద అవసరమైన అన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని స్థానిక కౌన్సిలర్ గుమ్ముల అశోక్ రెడ్డి కోరారు. సోమవారం ఆయన మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, మున్సిపల్ చైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా ఆడపడుచులు జరుపుకొనే బతుకమ్మ నిమజ్జనం వేళ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. చెక్కి చెరువు పరిసరాలను శుభ్రపరచడంతో పాటు విద్యుత్ దీపాలు, తాగునీటి సదుపాయం కల్పించాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని కోరారు. తమ వినతిపై సానుకూలంగా స్పందించిన మున్సిపల్ అధికారులు, నాయకులకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మున్నా, అజర్ తదితరులు ఉన్నారు.



పింఛను దరఖాస్తుల ఆన్‌లైన్‌లో నిర్లక్ష్యం!

- **అర్హత ఉన్నా ఐడీ రాలేదని ఆవేదన**
- **ప్రజావాణిని ఆశ్రయించిన బాధితులు**

బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 05(డిడి9 వార్త) :

ఆసరా పింఛను కోసం అన్ని ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకున్నా, అధికారుల అలసత్వం వల్ల తాము లబ్ధికి దూరమవుతున్నామని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సాలూర మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తమకు ఎదురవుతున్న సమస్యపై వినతిపత్రం అందజేశారు. సాలూర గ్రామానికి చెందిన సంగేపు లాలయ్య వికలాంగ పింఛను కోసం, ఎస్.చంద్రకళ, పుట్టి లక్ష్మిలు వితంతు పింఛను కోసం పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేశారు. ఇటీవల అధికారులు ఇంటింటికీ వచ్చి ఆసరా పింఛన్ల సర్వే, పరిశీలన జరుపుతుండగా.. తమ వద్దకు రాకపోవడంతో అనుమానం వచ్చి పంచాయతీ కార్యదర్శిని, ఎంపీడీఓను ప్రశ్నించినట్లు బాధితులు తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్ చేశామని, అయితే ఐడీ జనరేట్ కాలేదని అధికారులు సమాధానమిస్తున్నారని వాపోయారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల అర్హత ఉండి కూడా తమకు పింఛను దక్కకుండా పోతోందని లబోదిబోమంటున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపి, తమకు ఆసరా పింఛన్లు మంజూరయ్యేలా న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.



భారత చీఫ్ ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి

- **వామపక్ష పార్టీల నేతల డిమాండ్**
- **బోధన్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా**

బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 05(డిడి9 వార్త) :

భారత చీఫ్ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బోధన్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం సంబంధిత అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వామపక్ష పార్టీల ప్రతినిధులు శంకర్ గౌడ్, వరదయ్య మాట్లాడుతూ.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలన్నారు. 'సర్' ప్రక్రియ పేరుతో దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్లకు పైగా ఓట్లను తొలగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది అధికార భాజపాకు అనుకూలంగా మార్చే కుట్ర అని ఆరోపించారు. బీహార్, పశ్చిమ బెంగాల్‌లలో భాజపాకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లను పెద్దఎత్తున తొలగించారని, దీనిపై బాధితులు ఆధారాలతో సుప్రీంకోర్టును ఆశ్రయించారని గుర్తు చేశారు. ఈ ప్రక్రియపై సుప్రీంకోర్టు ఇప్పటికే విచారణ కమిటీని వేసిందని తెలిపారు. 'సర్' ప్రక్రియను వెంటనే నిలిపివేయకపోతే దేశవ్యాప్తంగా ప్రజా తిరుగుబాటు వస్తుందని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు ఏశాల గంగాధర్, గంగాధరప్ప, సాయాగౌడ్, బండారి గంగాధర్, పత్రి ఎల్లయ్య, జంగం గంగాధర్, గోపి, సుల్తాన్, సాయిలు, గంగామణి, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.





నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటా..

- **డాక్టర్ ఎంఏ అకీమ్**
- **ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాల వివరాలు నా దృష్టికి తీసుకురావాలి**

పోతంగల్, అక్టోబర్ 5: (డిడి9 వార్త):

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని పాత పోతంగల్ గ్రామానికి చెందిన ముస్లిం మబ్బుల్ అనారోగ్యంతో బాధపడుతూ రెండు రోజుల క్రితం మృతి చెందారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ ఆత్మకు శాంతి చేకూరాలని బీఆర్ఎస్ నాయకుడు, సామాజిక సేవకుడు డాక్టర్ ఎంఏ అకీమ్ భగవంతుడిని ప్రార్థించారు.

ఈ సందర్భంగా డాక్టర్ ఎంఏ అకీమ్ మాట్లాడుతూ పోతంగల్ మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో నిరుపేద కుటుంబాల్లో ఎవరైనా మరణించినా, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, వికలాంగులు, మతిస్థిమితం లేని వారు, కంటి చూపు లేని నిరుపేదలు ఉన్నా వారి వివరాలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు తన దృష్టికి విషయాలను తీసుకువస్తే, తనకు చేతనైన మేరకు ఆర్థిక సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు.

"సృష్టిలో భగవంతుడు అందరికీ సంపదను ఇచ్చినా, దానిని నలుగురితో పంచుకునే గుణం మాత్రం కొందరికే ఇస్తాడు. మీ అందరి ఆశీస్సులతో నాకు లభించిన ఈ సేవా భావంతో, నాకు చేతనైన మేరకు ప్రతి ఒక్కరికీ సహాయం చేస్తాను" అని డాక్టర్ ఎంఏ అకీమ్ సభా ముఖంగా తెలిపారు. మబ్బుల్ కుటుంబానికి తనవంతు సేవ చేసే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మబ్బుల్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని భగవంతుడిని ప్రార్థించారు.



ఆర్టీసీ విలీనానికి ప్రభుత్వం సిద్ధం

నిజామాబాద్, అక్టోబర్ 05 (డిడి9 వార్త):

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం ఆర్మూర్ పట్టణంలోని బస్ డిపో పరిసరాల్లో ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులు ఆయనను కలిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యలు, వారి కష్టాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పూర్తి అవగాహన ఉందన్నారు. కార్మికులకు సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు అవసరమైన కార్మిక చట్టాల్లో మార్పులు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన అనంతరం ఎదురైన సాంకేతిక, పరిపాలనా సమస్యలను ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలిస్తోందన్నారు. ఆయా రాష్ట్రాల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని, భవిష్యత్తులో కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్మూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, కౌన్సిలర్లు శాల ప్రసాద్, భూపేందర్, సుమన్, నవీన్, మల్లయ్య, గంగాధర్, రవీందర్‌తో పాటు పలువురు కార్మిక నాయకులు పాల్గొన్నారు.





2027 ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ అత్యంత కీలకం

- కెప్టెన్ గిల్‌కు రోహిత్ అనుభవం, సలహాలు ఎంతో ఉపయోగపడతాయన్న దినేశ్
- ఒత్తిడి సమయాల్లో గిల్.. రోహిత్‌పైనే ఆధారపడతాడని కార్తీక్ జోస్యం
- దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలో జరగనున్న 2027 ప్రపంచకప్
- వన్డేల్లో తనకు ఇంకా పని మిగిలి ఉందని రోహిత్ ఇటీవలే చెప్పిన వైనం



ప్రజాక్షేత్రం :

2027 వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టుకు సీనియర్ ఓపెనర్ రోహిత్ శర్మ సేవలు అత్యంత కీలకం కానున్నాయని టీమిండియా మాజీ వికెట్ కీపర్‌బ్యాటర్ దినేశ్ కార్తీక్ అభిప్రాయపడ్డాడు. రోహిత్ శర్మ అపారమైన అనుభవం, ప్రస్తుత ఫామ్ జట్టుకు అతిపెద్ద బలమని, ముఖ్యంగా యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు అతని మార్గదర్శకత్వం ఎంతో అవసరమని కార్తీక్ పేర్కొన్నాడు. వెస్టిండీస్‌తో జరుగుతున్న ప్రస్తుత సిరీస్‌ను దినేశ్ కార్తీక్ ఉదాహరణగా చూపించాడు. గువాహటిలో జరిగిన మ్యాచ్‌లో ఛేజింగ్ సమయంలో రోహిత్ శర్మ సాధించిన సెంచరీ అతని ఫామ్‌కు నిదర్శనమని ప్రశంసించాడు. ఆటలో ఎదురయ్యే తీవ్ర ఒత్తిడితో కూడిన పరిస్థితులను ఎదుర్కోవడంలో రోహిత్ అనుభవం గిల్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నాడు.

ఈ విషయంపై కార్తీక్ మాట్లాడుతూ.. "ఒక కెప్టెన్‌గా, నాయకుడిగా ఆటలో ఉత్కంఠభరిత మైన క్షణాల్లో రోహిత్ ఇచ్చే సలహాలు అమూల్యమైనవి. ముఖ్యంగా ఒక పెద్ద మ్యాచ్‌లో, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కచ్చితంగా రోహిత్ వైపే చూస్తాడని, అతనిపైనే ఆధారపడతాడని నేను భావిస్తున్నాను" అని స్పష్టం చేశాడు. సీనియర్ ఆటగాడిగా, మాజీ కెప్టెన్‌గా జట్టులో రోహిత్ పోషించే పాత్ర కీలకమని పేర్కొన్నాడు.

కాగా, వన్డే ఫార్మాట్‌లో తనకు ఇంకా 'పని మిగిలి ఉంది' అని, 2027 ప్రపంచకప్‌లో ఆడాలనే తన కోరికను రోహిత్ శర్మ ఇటీవల బహిరంగంగా వెల్లడించాడు. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ మెగా టోర్నమెంట్‌లో ఆడటమే లక్ష్యంగా హిట్‌మ్యాన్ ముందుకు సాగుతున్నాడు. వన్డేల్లో నిలకడగా పరుగులు సాధిస్తుండటంతో, రాబోయే ప్రపంచకప్ కోసం భారత జట్టు రూపొందించే ప్రణాళికల్లో రోహిత్ శర్మ కేంద్ర బిందువుగా కొనసాగుతున్నాడు.

గంగూలీ కెప్టెన్సీలో టీమిండియా లక్ష్యం అదే.. సెహ్వాగ్ ఆసక్తికర వ్యాఖ్యలు

- గంగూలీ జట్టు లక్ష్యం విదేశాల్లో ఎక్కువ విజయాలేనన్న సెహ్వాగ్
- అప్పటి జట్టు ఆ లక్ష్యాన్ని సాధించిందని వ్యాఖ్య
- ప్రస్తుత టీమిండియా ఆటతీరుపై మాట్లాడలేనన్న సెహ్వాగ్
- మ్యాచ్ పరిస్థితికి తగ్గట్టే తన ఆట మార్చేవాడినని వివరణ
- అవసరమైతే రక్షణాత్మకంగా ఆడానని వెల్లడి



ప్రజాక్షేత్రం :

సౌరవ్ గంగూలీ నాయకత్వంలో టీమిండియా ఎలా ఆడేదో మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ గుర్తు చేసుకున్నాడు. విదేశీ గడ్డపై వీలైనన్ని మ్యాచ్‌లు గెలవాలన్నదే అప్పటి జట్టు ప్రధాన లక్ష్యమని చెప్పాడు. ప్రస్తుత టీమిండియా ఆట తీరుపై మాత్రం తాను మాట్లాడలేనని స్పష్టం చేశాడు.

'రైజ్ అండ్ ఫాల్' రెండో సీజన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా సెహ్వాగ్ ఐఏఎన్ఎస్‌తో మాట్లాడాడు. ఈ సందర్భంగా అప్పటి జట్టు ఆలోచనా విధానాన్ని వివరించాడు. ''నేను దాదా నాయకత్వంలోని జట్టులో ఉన్నాను. కాబట్టి ఆ జట్టు ఆలోచనా విధానం గురించి చెప్పగలను. ప్రస్తుత జట్టులో నేను లేను. వారి ఆటతీరు గురించి నాకు పూర్తిగా తెలియదు. అందుకే దానిపై మాట్లాడలేను'' అని సెహ్వాగ్ అన్నాడు.

గంగూలీ నాయకత్వంలో తమ ప్రధాన లక్ష్యం అంతర్జాతీయ మ్యాచ్ లలో ఎక్కువగా గెలవడమేనని చెప్పాడు. విదేశీ గడ్డపై విజయాలు సాధించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని తెలిపాడు. ఆ లక్ష్యాన్ని జట్టు సాధించిందని సెహ్వాగ్ గుర్తు చేసుకున్నాడు.

తాను ఎప్పుడూ దూకుడుగా ఆడేవాడిని కాదని కూడా సెహ్వాగ్ గతంలో చెప్పిన విషయాన్ని ప్రస్తావించాడు. మ్యాచ్ పరిస్థితిని బట్టి తన ఆట తీరును మార్చుకునేవాడినని తెలిపాడు. అవసరమైనప్పుడు రక్షణాత్మకంగా కూడా ఆడానని చెప్పాడు.

సెహ్వాగ్, సచిన్ టెండూల్కర్ ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ప్రమాదకరమైన ఓపెనింగ్ జోడీల్లో ఒకటిగా నిలిచింది. ఇద్దరూ కలిసి టీమిండియా ఎన్నో విజయాల్లో కీలక పాత్ర పోషించారు.

'రైజ్ అండ్ ఫాల్' రెండో సీజన్‌కు సెహ్వాగ్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్నాడు. గత సీజన్‌లో ఈ బాధ్యతలు నిర్వహించిన అశ్నీర్ గ్రోవర్ స్థానంలో అతడు వచ్చాడు. ఈ రియాలిటీ షోలో 15 మంది కంటెస్టెంట్లు 42 రోజుల పాటు పోటీపడతారు. అధికారాన్ని దక్కించుకోవడం, వ్యూహాలు, పొత్తులు ఈ ఆటలో కీలకంగా ఉంటాయి. ఈ షో అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్‌లో ప్రసారం అవుతోంది.

షమీ శకం ముగిసింది.. అతడిని తిరిగి జట్టులోకి తీసుకోవడంలో అర్థం లేదు

- షమీ శకం ముగిసిందని, జట్టు ముందుకు సాగిపోయిందని స్పష్టీకరణ
- వెస్టిండీస్‌తో సిరీస్‌లో బౌలర్లు విఫలమైనా షమీ అవసరం లేదని వ్యాఖ్య
- రోహిత్, కోహ్లీ మాత్రం జట్టులో కొనసాగాలని కార్తీక్ ఆకాంక్ష



ప్రజాక్షేత్రం :

టీమిండియా సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ అంతర్జాతీయ కెరీర్ దాదాపు ముగిసినట్లేనని భారత మాజీ క్రికెటర్, ప్రముఖ వ్యాఖ్యాత దినేశ్ కార్తీక్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. భారత జట్టు ఇప్పటికే షమీని దాటి ముందుకు వెళ్లిపోయిందని, ఇప్పుడు అతడిని తిరిగి జట్టులోకి తీసుకోవడంలో ఎటువంటి ప్రయోజనం లేదని స్పష్టం చేశాడు.

2025లో చివరిసారిగా అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన మహమ్మద్ షమీ, అప్పటి నుంచి గాయాలు, ఫిట్‌నెస్ సమస్యలు, కొన్నిసార్లు ఇతర కారణాలతో జట్టుకు దూరంగా ఉంటున్నాడు. దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నప్పటికీ, జాతీయ జట్టులో అతడి పునరాగమనంపై ఆశలు క్రమంగా సన్నగిల్లుతున్నాయి.

ఇటీవల వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను భారత్ 21తో గెలిచినప్పటికీ, భారత బౌలర్లు తీవ్రంగా నిరాశపరిచారు. బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌లపై మన బౌలర్లు తేలిపోవడంతో, అనుభవజ్ఞుడైన షమీని తిరిగి తీసుకురావాలనే చర్చ మొదలైంది.

ఈ నేపథ్యంలో క్రిక్‌బజ్‌తో మాట్లాడుతూ దినేశ్ కార్తీక్ తన అభిప్రాయాన్ని పంచుకున్నాడు. "షమీని తిరిగి జట్టులోకి తీసుకోవాలా అని అడిగితే నా సమాధానం వద్దనే. భారత జట్టులో ఇప్పటికే చాలా మంది పేసర్లు ఉన్నారు. జట్టు షమీని దాటి ముందుకు సాగింది. ఇప్పుడు వెనక్కి వెళ్లడంలో అర్థం లేదు. షమీ దేశవాళీలో అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నప్పటికీ, అతడిని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు" అని కార్తీక్ అన్నాడు. ప్రస్తుతం జట్టులో మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ వంటి పేసర్లు ఉండగా.. గుర్నూర్ బ్రార్, అకిబ్ నబీ, అన్షుల్ కంబోజ్ వంటి యువ బౌలర్లకు అవకాశాలు ఇస్తున్నారని గుర్తుచేశాడు. ఆసక్తికరంగా షమీ విషయంలో కఠినంగా వ్యవహరించిన కార్తీక్.. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ విషయంలో మాత్రం భిన్నంగా స్పందించాడు. వారిద్దరూ జట్టులో కొనసాగాలని ఆకాంక్షించాడు. వచ్చే ఏడాది ప్రపంచకప్ తర్వాత వారు రిటైరైతే వన్డే క్రికెట్ భవిష్యత్తు అంధకారంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశాడు. "రోహిత్, కోహ్లీ ప్రపంచ క్రికెట్‌లోని అతిపెద్ద స్టార్లు. ప్రపంచ క్రికెట్‌కు కేంద్రంగా ఉన్న భారత్‌కు చెందిన ఈ ఇద్దరు మేటి ఆటగాళ్లు తప్పుకుంటే, అది కచ్చితంగా ఆటపై తీవ్ర ప్రభావం చూపుతుంది" అని కార్తీక్ వివరించాడు.

నేడు బోధన్ పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేత

బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 05(డీడీ9 వార్త) :

11 కేవీ ఆజంగంజ్ ఫీడర్ నిర్వహణ, చెట్ల కొమ్మల సరికివేత పనుల దృష్ట్యా మంగళవారం బోధన్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టిజిఎన్‌పిడిసిఎల్ బోధన్ టౌన్1 ఏఈ నాయిని కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆజాం గంజ్ ఏరియా, సాయిబాబా టెంపుల్ ప్రాంతం, గోశాల రోడ్ పరిధిలోని కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

సాలూర జీపీ స్క్రాప్ వేలం.. రూ. 2.21 లక్షల ఆదాయం

బోధన్, నిజామాబాద్ జిల్లా, అక్టోబర్ 05(డీడీ9 వార్త) :

సాలూర గ్రామ పంచాయతీ కార్యాలయ పరిధిలో మూలనపడి ఉపయోగంలో లేని పాత ఇనుము, ఇతర స్క్రాప్ సామగ్రికి సోమవారం అధికారులు బహిరంగ వేలంపాట నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ పాటలో పలువురు వ్యాపారులు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పంచాయతీ ఆదాయాన్ని పెంచే దిశగా పారదర్శకంగా నిర్వహించిన ఈ వేలంలో వ్యాపారుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. చివరికి మంచల్వార్ రవి అనే వ్యక్తి రూ. 2,21,000లకు అత్యధిక మొత్తం పాడుకుని ఈ వేలంపాటను దక్కించుకున్నట్లు కార్యదర్శి ప్రవీణ్ వెల్లడించారు. వేలం ద్వారా వచ్చిన మొత్తాన్ని నియమావళి ప్రకారం పంచాయతీ ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణలో భాగంగా మూలనపడ్డ సామగ్రిని తొలగించి కార్యాలయ ఆవరణను శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది శివ, విజయ్‌కుమార్‌లతో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.



ప్రయోగాలకు ఇక టైమ్ లేదు.. ప్రపంచకప్ జట్టుపై గిల్ కీలక ప్రకటన!

- ప్రపంచకప్ కోసం ఇప్పటి నుంచే జట్టు సిద్ధం చేయాలని గిల్ నిర్ణయం
- వచ్చే న్యూజిలాండ్ సిరీస్ నుంచే ప్రధాన జట్టుతో బరిలోకి దిగే యోచన
- గాయాలు, ఆసియా క్రీడలతో కీలక ఆటగాళ్లు దూరం
- యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించిన టీమ్ఇండియా
- అన్షుల్, ఆకిబ్‌లకు మరిన్ని అవకాశాలు ఉంటాయని గిల్ వెల్లడి

ప్రజాక్షేత్రం :

వన్డే ప్రపంచకప్‌కు ఏడాది మాత్రమే సమయం ఉండటంతో ఇక ప్రయోగాలకు స్వస్తి పలకాలని టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ భావిస్తున్నాడు. వచ్చే సిరీస్ నుంచే ప్రపంచకప్‌లో ఆడించాలనుకుంటున్న జట్టుతో బరిలోకి దిగాలని స్పష్టం చేశాడు. ఆటగాళ్ల గాయాలు, ఇతర టోర్నీల షెడ్యూల్ కారణంగా పూర్తి స్థాయి జట్టుతో ఆడలేకపోయామని తెలిపాడు. అయితే ఈ పరిస్థితి కొత్త ఆటగాళ్లకు తమ సత్తా నిరూపించుకునే మంచి అవకాశాన్ని ఇచ్చిందని పేర్కొన్నాడు.

వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌ను భారత్ 21తో కైవసం చేసుకుంది. అయితే చివరి వన్డేలో ఐదు వికెట్ల తేడాతో ఓటమి పాలైంది. ఆసియా క్రీడల్లో స్వర్ణం నిలబెట్టుకునేందుకు భారత్ పూర్తి స్థాయి టీ20 జట్టును పంపడంతో పలువురు కీలక వన్డే ఆటగాళ్లు ఈ సిరీస్‌కు దూరమయ్యారు. జస్‌ప్రీత్ బుమ్రా, శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ ఆసియా క్రీడల్లో పాల్గొన్నారు. హార్దిక్ పాండ్యా, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా గాయాలతో అందుబాటులో లేకపోయారు.

దీంతో రుతురాజ్ గైక్వాడ్, నమన్ ధీర్, అన్షుల్ కాంబోజ్, ఆకిబ్ నబీ వంటి ఆటగాళ్లకు అవకాశాలు దక్కాయి. నితీశ్ కుమార్ రెడ్డి, గుర్నూర్ బ్రార్ వంటి యువ ఆటగాళ్లను కూడా ప్రపంచకప్ కోసం సిద్ధం చేస్తున్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటుకోవాలని గిల్ సూచించాడు.అయితే ఇకపై ప్రయోగాలకు ఎక్కువ సమయం లేదని గిల్ స్పష్టం చేశాడు.వచ్చే న్యూజిలాండ్ పర్యటన నుంచి అందుబాటులో ఉన్న ప్రధాన ఆటగాళ్లతోనే బరిలోకి దిగాలని భావిస్తున్నట్లు తెలిపాడు. ఆ పర్యటనలో ఐదు వన్డేలు, ఐదు టీ20లు, రెండు టెస్టులు జరగనున్నాయి. ప్రపంచకప్‌లో ఆడించే జట్టును ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నాడు.

వెస్టిండీస్ సిరీస్‌లో అరంగేట్రం చేసిన అన్షుల్ కాంబోజ్, ఆకిబ్ నబీలకు గిల్ మద్దతుగా నిలిచాడు. పరుగులు సమర్పించుకున్నప్పటికీ వారిద్దరికీ భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు వస్తాయని చెప్పాడు. అన్షుల్ ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్ చేయగలగడం జట్టుకు కీలకమని అభిప్రాయపడ్డాడు.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500204. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.